

ఆగ్రహ జ్వాల



కోల్‌కతా ఘటనలో నిందితుడు సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నర్సింగ్ విద్యార్థులు

నెల్లూరు (వైద్యం) : కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి నెల్లూరు నగరంలో 24 కళాసంఘాల ఆధ్వర్యంలో నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. కాగడాలు చేతబట్టి వీఆర్‌సీ నుంచి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఈ కేసులో ముద్దాయి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. భరతమాత వేషధారణలో ఓ విద్యార్థిని పాల్గొనడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాంజలి ఆర్కెస్ట్రా నిర్వాహకుడు శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇంతవరకు అసలైన నిందితులను పట్టుకోకపోవటం సిగ్గుచేటని, పైగా కేసును సీబీఐకి అప్పగించడం ఆ ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తోందని మండిపడ్డారు.

● గళం విప్పిన జూడాలు

జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జూడాలు కూడా ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి నుంచి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. సెల్‌ఫోన్ లైట్లు వేసుకుని ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు జునాయిద్ ఆలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి పీరస్ జోయల్, కార్యదర్శి హితేష్ యాదవ్, ఉపాధ్యక్షులు ఉత్తమ్‌కుమార్, రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు తేజస్విని, అబిద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తీగ లాగితే డొంక కదిలేనా!?

- జగనన్న ఇళ్ల నిర్మాణంపై విజిలెన్స్ విచారణ
- కావలిలో 8 మంది సభ్యుల పరిశీలన

కావలి, ఆగస్టు 20 : జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల నిర్మాణాల్లో చోటు చేసుకున్న అవినీతిని నిగ్గు తేల్చేందుకు మంగళవారం విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. జిల్లాలో అత్యధికంగా కావలి పట్టణంలోనే 6,700 ఇళ్లు మంజూరు కావడంతో వాటి కోసం భూముల కొనుగోళ్లు, లేఅవుట్ల లెవలింగ్, లబ్ధిదారుల ఎంపిక, స్టీలు, సిమెంట్ మాయం, ప్రభుత్వం సరఫరా చేసిన ఇసుక అమ్ముకుని సముద్రపు ఇసుకతో నిర్మాణాలు, పనులు పూర్తి చేయకనే బిల్లులు తీసుకోవడం ఇలా కాలనీల్లో అడుగడుగునీ అవినీతి చోటుచేసుకుందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై పత్రికల్లో కథనాలు రావడమేగాక ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. 8 మంది సభ్యులు గల అధికారుల బృందం ముసునూరు మెగా లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.

● విచారణ పారదర్శకంగా జరిగేనా!?




ముసునూరు మెగా లేఅవుట్‌లో జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ బృందం


జగనన్న లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ పారదర్శకంగా జరిగేనా అన్న అనుమానాలు రేగుతున్నాయి. గతంలో కొద్దిపాటి వర్షానికే కొన్ని ఇళ్ల గోడలు కూలిపోగా అప్పట్లో కూడా విజిలెన్స్ అధికారులు విచారించారు. అయితే, చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటం, కాంట్రాక్టర్లు వైసీపీ నాయకులే కావడంతో గుట్టు చప్పుడు కాకుండా సర్దుబాటు చేశారు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండటంతో జరిగిన అక్రమాలపై ఏకపక్షంగా విచారణ జరిపేందుకు వీల్లేదని, అవినీతి అక్రమాలు బయటకు వస్తాయనే నమ్మకం ప్రజల్లో ఉంది.

- మోగుతున్న పెండ్లిబాజాలు
- ఈ శ్రావణంలో పెళ్లిళ్లే.. పెళ్లిళ్లు
- నెలాఖరులోపు 50 వేలకుపైగా కల్యాణాలు
- మండపాలకు డిమాండ్
- ఆకాశానికి అంటిన ధరలు
- మధ్య తరగతిపై పెనుభారం

తాళికట్టు శుభవేళ!







శ్రావణ మాసం వ్రతాలు, పూజలకే కాదు పెళ్లి సందడికీ ప్రత్యేకం. మంచి ముహూర్తాలు ఉండటంతో ప్రస్తుత మాసంలో జిల్లాలో పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ నెల 18వ తేదీన భారీ ఎత్తున పెళ్లిళ్లు జరగ్గా, రాబోవు 21, 22, 23, 24, 26, 28, 29, 30, 31తేదీల్లో శుభలగ్నాలను పండితులు నిర్ణయించడంతో ఆయా ముహూర్తాలకు కూడా పెళ్లిళ్లు అత్యధికంగా జరగనున్నాయి. జిల్లాలో 50 వేలకుపైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని అంచనా. ఈ క్రమంలో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అన్నిచోట్ల సందడి నెలకొంది. పెళ్లి పెద్దలు కల్యాణ మండపాలు, పూల డెకరేషన్లు, భజంత్రీలు, పురోహితులు, ఫొటో, వీడియో షూటింగ్, భోజనాలు, విద్యుత్ డెకరేషన్ వంటి వాటిని విడివిడిగా బుక్ చేసుకుంటున్నారు. కొన్ని కల్యాణ మండపాలు వారు ప్యాకేజీలు ప్రకటించి అన్ని ఏర్పాట్లు వారే చేస్తున్నారు. అయితే పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతుండటంతో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ పెరిగి రేట్లు చుక్కలను చూపిస్తున్నాయి. ధరల పెరుగుదల వల్ల పెళ్లిళ్లకు సిద్ధపడ్డ మధ్య తరగతి కుటుంబాలపై అధిక భారం పడుతోంది. సగటున రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇవికాకుండా బంగారు నగలు, పెట్టుపోతలకు మరికొంత ఖర్చు చేయకతప్పదు. అయినప్పటికీ జీవితంలో వివాహ వేడుక ఒక్కసారే వస్తుంది కదా.. అనే ఉద్దేశంతో అప్పు చేసైన పెళ్లి ఘనంగా చేయడానికి ఎక్కువ మంది సిద్ధపడుతున్నారు. ఇక ధనవంతుల ఇళ్లలో అయితే పెళ్లి వేడుకకు వారి స్థాయిని బట్టి రూ.కోటి వరకు కూడా ఖర్చు చేస్తున్నారు.

● కార్మికులకు చేతినిండా పని

పెళ్లిళ్ల సీజన్ వస్తే ఆ వేడుకలపై ఆధారపడ్డ సుమారు 36 రకాల కార్మికులకు చేతినిండా పని ఉంటోంది. అందుకు అనుగుణమైన వ్యాపారులు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ముఖ్యంగా వస్త్రాభరణాల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఒకే నెలలో వేలాది వివాహాలు జరుగుతుండడంతో స్థానికంగానూ, జిల్లాలో ఉండే కార్మికులు, క్యాటరింగ్, భజంత్రీలు, పురోహితులు సరిపోక చెన్నై, తెలంగాణ, ఉత్తర కోస్తా జిల్లాల నుంచి పిలిపించుకుంటున్నట్లు వివాహ కాంట్రాక్టర్లు చెబుతున్నారు. మొత్తంగా ఈ శ్రావణ మాసంలో పీపీపీ.. డూడూడూ అంటూ జిల్లా అంతటా పెళ్లిబాజాలు మోగుతున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)



నెల్లూరు : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

ఎందుకు చేస్తున్నారో.. ఎవరి కోసం చేస్తున్నారో లేదా తమ గుట్టు రట్టవుతుందని చేస్తున్నారో తెలియదు కానీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. కారణాలు ఏవైనా ఈ ఘటనలలో విలువైన రికార్డులు దగ్ధమవుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. వెంటనే అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది.

భూ దస్త్రం..

నిఘా నేత్రం!

- రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశం
- వరుస అగ్నిప్రమాదాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 20 : ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాల్లో రికార్డులు దగ్ధమవుతుండటంతో అసైన్డ్ భూముల వ్యవహారం చర్చనీయాంశమైంది. 20 ఏళ్ల దాటిన అసైన్డ్ భూములను విక్రయించుకోవచ్చని వాటిని ఫ్రీహోల్డ్ చేస్తున్నట్లు జగన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ముసుగులో వైసీపీ నాయకులు రైతులతో ఒప్పందం కుదుర్చుకొని భూములను వారి పేరిట మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నేతల సూచనలతో 22-ఏ జాబితా నుంచి తప్పించి రిజిస్ట్రేషన్లు చేశారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా రెవెన్యూ శాఖ నుంచి ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి 7వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయవచ్చని ఆ శాఖకు నివేదిక అందింది. దీని ఆధారంగా సబ్ రిజిస్ట్రార్లు వింజమూరు, ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే, ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి 147 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి. మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందన్న ధీమాతో మిగిలిన ఫ్రీహోల్డ్ భూములను కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చూసిన వైసీపీ నేతలకు నిరాశే మిగిలింది. రిజిస్ట్రేషన్ శాఖపై ప్రభుత్వం దృష్టి సారించడంతో ఆ శాఖ ఐజీ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లపై నివేదిక కోరారు. దీంతో రిజిస్ట్రేషన్ చేసిన భూములపై జిల్లా అధికారులు విచారిస్తున్నారు.

● రిజిస్ట్రేషన్ శాఖపైనే నిఘా

ఇలాంటి అంశాల దృష్ట్యా రిజిస్ట్రేషన్ల శాఖపై ప్రభుత్వం గట్టి నిఘా పెట్టింది. ఆయా కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. ముఖ్యంగా దస్తావేజు రిజిస్టర్లు భద్రపరిచే గది మార్గంలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కుర్చీ దగ్గర, కంప్యూటర్ల గది, కార్యాలయ ప్రధాన ద్వారాల వద్ద కూడా ఏర్పాటు చేస్తున్నారు.



నెల్లూరు : అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో కానరాని సీసీ కెమెరాలు

● కలెక్టరేట్‌లో..

కలెక్టరేట్‌లో అత్యంత విలువైన రికార్డులతోపాటు బ్రిటీష్ కాలంనాటి భూవివరాలు తెలిపే రికార్డులు ఉంటాయి. అలాగే చుక్కల భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల వివరాల రికార్డులు కలెక్టరేట్‌లోనే ఉన్నాయి. ఈ రికార్డుల ఆధారంగానే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు రిజిస్ట్రేషన్లు చేస్తుంటారు. దీంతో కలెక్టరేట్‌లో ప్రధాన రికార్డులు భద్రపరిచే గది, కార్యాలయం లోపల, వెలుపల సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులను భద్రపరిచే గది వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

● రెవెన్యూ శాఖలో భాగమైన భూసర్వేశాఖలో విలువైన రికార్డులు ఉన్నాయి. వీటిని ప్రత్యేక గదులలో భద్రపరిచి ఉండగా ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని రోజులుగా పని చేయడం లేదు. నెల్లూరు అర్బన్ తహసీల్దారు కార్యాలయం లోనూ సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వీటిపై సరైన పర్యవేక్షణ లేకపో వడంతోనే అవి మరమ్మతులకు గురైనట్టు సమాచారం.



కలెక్టరేట్‌లోని రికార్డు గదిలో సీసీ కెమెరాలు

ఇదిగో స్మార్ట్ మీటర్!

- తొలిగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు : ఎస్ఈ



స్మార్ట్ మీటర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ) ఆగస్టు 20 : జిల్లాలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. మంగళవారం నగరంలోని తెలుగుగంగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కార్యాలయంలో స్మార్ట్ మీటరును ఏర్పాటు చేశారు. ఈ మీటరును అమర్చిన అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ తొలివిడతగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆ తర్వాత జిల్లా అంతటా విస్తరిస్తామని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నెల్లూరు (విద్య) : విధుల్లో అలసత్వంతోపాటు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ డీఈవో రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లు ఆర్వీ ప్రసన్నలక్ష్మి, ఎల్ శ్రీనివాసరావు విధుల్లో అలసత్వం వహించడమేకాక బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై నెల్లూరు డిప్యూటీఈవో విచారించి, నివేదిక అందచేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ టీచర్లను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ ఉపాధ్యాయులపై కొన్ని రోజుల క్రితం విద్యార్థులే కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన విషయం గమనార్హం.

ఆసుపత్రులకు


అత్తెసరు నిధులు

- ఎన్‌హెచ్‌ఎం ద్వారా రూ.56 లక్షల విడుదల
- పీహెచ్‌సీలకు రూ. 50వేలు
- సీహెచ్‌సీ, ఏరియా ఆరోగ్య కేంద్రాలకు రూ. 2.50 లక్షలు
- జిల్లాకు ఏటా రూ. 25 కోట్లు రావాలి
- మరి మిగతా నిధులు ఎప్పుడొస్తాయో..?

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 20 : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆసుపత్రుల్లో అత్యవసర మందులతోపాటు మరమ్మతులు, చిన్నచిన్న పరికరాలు, పరిసరాల పరిశుభ్రతకు ఈ నిధులే ఆధారం. ఏప్రిల్‌లోనే ఈ నిధులు రావాల్సి ఉన్నా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆలస్యమై తాజాగా విడుదలయ్యాయి. అయితే ఆశించిన, అవసరమైన స్థాయిలో కాకుండా అత్తెసరుగా నిధులివ్వడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతి ఏడాది జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లాలోని ఆసుపత్రు నిర్వహణకు రూ.1.51 కోట్లు, ఉద్యోగుల జీతభత్యాలతో కలిపి రూ.25 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం రూ.56 లక్షలు మాత్రమే విడుదల అయ్యాయి. వాటిని కూడా ఆసుపత్రుల నిర్వహణ కోసమే విడుదల చేసింది, మిగిలిన నిధులు ఎప్పుడు ఇస్తుందోనని వైద్య వర్గాలు పెదవి విరుస్తున్నాయి.

పీహెచ్‌సీలకు కేవలం రూ. 50 వేలే

జిల్లా వ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఒక్కోదానికి రూ.1.75 లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ.50 వేల వంతున రూ.26 లక్షలు మాత్రమే కేటాయించారు. ఇదేవిధంగా 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు ఒక్కోదానికి రూ. 5 లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ. 2.50 లక్షలు మాత్రమే ఇచ్చింది. కావలి, కందుకూరులోని ఏరియా ఆసుపత్రులకు కూడా రూ. 5 లక్షలకుగాను రూ. 2.50 లక్షలే విడుదల చేసింది. ఇక ఆత్మకూరు జిల్లా ఆసుపత్రికి రూ. 10 లక్షలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ. 5 లక్షలు ఇచ్చింది. ఇంత తక్కువ నిధులతో ఆసుపత్రులను ఎలా నిర్వహిస్తామని వైద్యాధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఉద్యోగుల జీతాలు, ఇతర ఖర్చులు ఎలా?

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వందలాది మంది ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరి జీతభత్యాలు జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే తగినన్ని నిధులు విడుదల చేయకపోవటంతో ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు ఆగమ్య గోచరంగా మారుతోంది. దీంతోపాటు వైద్యాధికారులు వాహన అలవెన్స్, ఇతర ఖర్చులకు కూడా ఎన్‌హెచ్‌ఎం నిధులే ఖర్చు చేయాల్సి ఉంది. అయితే నిధుల కొరత వల్ల ఉద్యోగులు నానా అగచాట్లు పడుతున్నారు. ఎన్‌హెచ్‌ఎంలో కేంద్రం వాటాగా ఇచ్చే 60 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుతుండటం వల్లే ఈ పరిస్థితి వస్తోందని ఆరోపిస్తున్నారు. నిధుల లేమితో ఆసుపత్రుల్లో వైద్య సేవలు కూడా కుంటుపడుతున్నాయి.

వచ్చిన నిధులనే ఆసుపత్రులకు ఇచ్చాం

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులనే ఆయా ఆసుపత్రులకు ఇచ్చాం. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించ లేకపోయాం. ఆసుపత్రుల నిర్వాహణ కోసమే ఈ నిధులు విడుదల చేయటం జరిగింది. మిగిలిన నిధులు ఎప్పుడు వస్తే అప్పుడు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆసుపత్రులకు పూర్తి స్థాయిలో కేటాయిస్తాం.

- డాక్టర్ పెంచలయ్య,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

హనుమంతుడిపై వెంకయ్య స్వామి

వెంకటాచలం : గొలగమూడిలో వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. 3వ రోజు మంగళవారం ఉదయం స్వామివారు హనుమంతుడిపై విహరించారు. వివిధ రకాల పూలతో అలంకరించిన హనుమంత వాహనంపై కొలువైన వెంకయ్య స్వామిని చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్లుగా భక్తులు పులకించిపోయారు. రాత్రి హంస వాహనంపై విహరించగా, భక్తులు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కాగా, బుధవారం వెంకయ్యస్వామి చినశేష, గజవాహనాలపై విహరిస్తారని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.



పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

● జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శరవేగంగా అనుమతులు ఇవ్వాలని సూచించారు. భారీ పరిశ్రమలకు అవసరమైన భూ సేకరణ, నీటివసతి, విద్యుత్ మౌలిక సదుపాయాలు కల్పన తదితర విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు, సంక్షేమ పథకాల లబ్ధిపై సర్వే చేయాలన్నారు. నూతనంగా పరిశ్రమలు స్థాపించే వారికి పీఎంఈజీపీ పథకం గురించి వివరించాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జెడ్ఎం విజయరత్నం, విద్యుత్ శాఖ అధికారి విజయన్, కాలుష్య నియంత్రణ అధికారి రాజశేఖర్, కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి తాళం..

మధ్యాహ్నానికే
ఉద్యోగుల జంప్!

- తీవ్ర అసహనం వ్యక్తం చేసిన కమిషనర్
- ఇలాగైతే ప్రజాసమస్యలు ఎవరు తీరుస్తారంటూ ఆగ్రహం



తాళం వేసిన సచివాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

"ఇదేంటి తాళాలేశారు!? సచివాలయం మూయడమేంటి? మధ్యాహ్నానికే టైం అయిపోతుందా!? ఉద్యోగులంతా ఎక్కడు న్నారో పిలిపించండి!" అంటూ నగర పాలక సంస్థ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని పలు ప్రాంతాలను కమిష నర్ పరిశీలి స్తూ 9వ డివిజన్ పరిధిలోని 2వ సచివాలయం (నవాబ్ పేట) వద్ద కు 1.30 గంటలకు వచ్చారు. అప్పటికే సచివాలయానికి తాళం వేసి సిబ్బంది వెళ్లిపోయారు. ఇది చూసిన కమిషనర్ విస్మయానికి గురై 'ఇదేంటండీ సచివాలయానికి తాళం వేశారు?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉద్యోగులంతా రావాలని ఆదేశించారు. అంతే.. ఎక్కడె క్కడో ఉన్న ఉద్యోగులంతా నిమిషాల్లో సచివాలయం వద్ద వాలి పోయా రు. వాళ్లంతా వచ్చాక ఇదేనా మీరు చేసే ఉద్యోగం? అంటూ మండిపడ్డారు. మధ్యాహ్నానికే ఇళ్ల కు వెళ్లిపోతే ఇక ప్రజల సమస్యలు, అవసరాలు, ఇబ్బందులు ఎవరు తీరుస్తారంటూ ఆగ్రహం వ్య క్తం చేశారు. ఈ సచివాలయంలో ఎవరెవరు పని చేస్తున్నారో వివరాలు తీసుకుని తనకు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

- నెల్లూరు (సిటీ)

కచ్చితమైన దిగుబడులు నమోదు చేయాలి

- వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 20 : పంటకోత ప్రయోగాలు ఎంతో జాగ్రత్తగా నిర్వహించి కచ్చితమైన దిగుబడులు నమోదు చేయాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ పీ సత్యవాణి సూచించారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం పంటకోత ప్రయోగాల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్-24 సీజన్‌కు ప్రభుత్వం సీసీఈ యాప్ ద్వారా పంటకోత ప్రయోగాలు నిర్వహించాలని ఆదేశించిందని వివరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏఎస్ రాజు మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ద్వారా వచ్చే దిగుబడుల ఆధారంగా రైతులకు పంట నష్టపరిహారం అందుతుందని తెలియజేశారు. ఏడీ లక్ష్మీ నరసింహులు, గణాంక అధికారి శ్యాంకుమార్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శేషగిరి, నర్సోజీరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి



రోడ్డుపై విద్యార్థుల ఆందోళన

పబ్బులేటిపల్లి గ్రామ విద్యార్థులు మంగళవారం రోడ్డుపై బ్యాగులు అడ్డుగా పెట్టి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కేటాయించిన స్టూడెంట్ బస్సులో ప్యాసింజర్లను ఎక్కించుకుంటున్నారని మండిపడ్డారు. అందులో తాగుబోతులు ఎక్కుతుండటంతో తమకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కల్యాణ్ అనే విద్యార్థి బస్సులో నుంచి జారిపడి గాయపడ్డారని వాపోయారు. ఈ విషయాన్ని ఉదయగిరి డిపో మేనేజర్‌కి తెలుపగా తమకేం సంబంధం లేనట్టు సమాధానం చెప్పారని తెలిపారు. అధికారులు స్పందించి బస్సు వేళల్లో మార్పు చేసి రెండు ట్రిప్పులు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు.

- సీతారామపురం

పోలీసు శాఖకు మూడు బొలెరో వాహనాలు

- ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఎస్పీ కృతజ్ఞతలు



ఎస్పీకు బొలెరో తాళాలు అందిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు (క్రైం), ఆగస్టు 20: జిల్లా పోలీసు శాఖకు మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమి రెడ్డి చంద్ర మోహన్ రెడ్డి మూడు వాహనా లను అందజేశా రు. రూ.29 లక్షల విలువ చేసే మూడు బొలెరో వాహనాలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు అందించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు రేయింబవళ్లు పనిచేస్తుంటారని, వారికి మంచి వాహనాల అవసరం ఉందన్నారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా పోలీసులకు కావాల్సిన అత్యవసర సదుపాలయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ జిల్లా పోలీసు యంత్రాంగానికి సహకరిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి, జీఈఎఫ్ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఈఎఫ్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, ఏజీఎం పంపాపతి, ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించటానికి చర్యలు తీసుకోండి : కలెక్టర్

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 20 : మాతా శిశు మరణాలను తగ్గించడానికి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. ఇప్పటివరకు జిల్లాలో సంభవించిన మరణాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైరిస్క్ ఉన్న కేసులను ముందుగానే గుర్తించి ఆధునిక వైద్యసేవలు అందేలా చూడాలని ఆదేశించారు. అవసరమైతే జీజీహెచ్ వంటి పెద్దాసుపత్రులకు రెఫర్ చేయాలని సూచించారు. మొదటిసారి గర్భవతులు పరీక్షలకు రాగానే వారి ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులను పరిశీలించి ఆ కార్డులు లేకపోతే వెంటనే తెప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వచ్చే రోగుల వివరాలను కూడా అభయ్ యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు మరణాలు జరిగినప్పుడు బాధిత కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించి తప్పనిసరిగా పోస్టుమార్టం చేయించాలని సూచించారు. రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి రక్తదాన శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో డీఎంహెచ్‌వో పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్ నాథ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దా నాయక్, డీఐవో ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలను సహించం

- నందిపాడులో డ్వామా పీడీ ఆకస్మిక తనిఖీ
- సిబ్బందికి మెమోల జారీ



ఉపాధి హామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ శ్రీనివాసులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 20: జిల్లాలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో సిబ్బంది ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సహించమని డ్వామా ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నందిపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పని జరుగుతున్న ప్రదేశంలో మస్టర్లు లేకపోవడంతో పాటు క్షేత్రసహాయకుడు చెప్పిన కూలీల సంఖ్యకు పని చేస్తున్న కూలీల సంఖ్యకు తేడా ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు పని వద్ద మస్టర్లు లేకుండా ఎలా పనులు చేస్తారంటూ సిబ్బందిపై మండిపడ్డారు. నందిపాడు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై తనకు పలు ఫిర్యాదులు వస్తున్నాయని, త్వరలో పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు శాఖాపరమైన చర్యలు తీసుకొంటా మన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన క్షేత్ర సహాయకుడు భాస్కర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు ఏపీవో బ్రహ్మయ్య, ఈసీ శ్రీనివాసులు, టీఏ శ్రీరంగలకు మెమోలు జారీ చేశారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. అలాగే ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలతో క్లస్టర్‌స్థాయి ఇన్‌చార్జి పీడీ సమీక్షా సమావేశం నిర్వహించారు.

'ఉపాధి'లో రూ.4.51 లక్షల రికవరీకి ఆదేశం

జలదంకి : మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో బహిర్గతమయ్యాయి. మండలంలోని 17 పంచాయతీల పరిధిలో ఏడాది పాటు రూ.7కోట్లతో 1023 పనులు చేపట్టారు. ఇందులో గృహ నిర్మాణశాఖకు చెందిన 48 గృహ లబ్ధిదారులకు ఒక్కో గృహానికి 90 రోజుల పనిదినాలు కల్పించారు. ఈ మొత్తం పనులపై ఇటీవల అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సామా జిక తనిఖీలు చేపట్టారు. ఈ వివరాలను మంగళవారం డ్వామా పీడీ శ్రీనివాసులు, ఏపీడీ విజయలక్ష్మి నిర్వహించిన ప్రజావేదిక ముందుంచారు. దీనిపై సమగ్ర విచారణ చేసిన అనంతరం మండలంలోని 17 పంచాయతీలలో జరిగిన పనుల్లో రూ.4.51లక్షల పంపిణీకి సంబంధించి లెక్కలు సరిపోక పోవడంతో సంబంధిత సిబ్బంది నుంచి ఈ మొత్తాన్ని రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. ఇందులో కమ్మవారిపాలెం పంచాయతీలో రూ.63 వేలు రికవరీ చేయాల్సి ఉంది. దీంతో ఇక్కడ పనిచేస్తున్న ఎఫ్ఏ మౌనికను సస్పెండ్ చేశారు. ఆమె కుటుంబంలో అక్రమంగా చేయించుకున్న జాబ్‌కార్డులను తొలగించారు. మిగిలిన 16 పంచాయతీలలో మస్టర్లలో కొద్దిపాటి తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రజావేదికలో ఏపీవో శ్యామల, ఎఫ్ఏలు, టీఏలు, ఈసీలు, పలువురు సర్పంచులు, ఎంపీటీ సీలు, టీడీపీ నాయకులు తల్లపనేని మధుసూదనరావు, కంచర్ల వినోద్‌నాయుడు, స్వర్ణ కొండపనాయుడు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	123
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	222
స్కిన్‌లెస్	244
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6910
వెండి కిలో ధర	రూ. 87,800
వెండి ఒక గ్రాము	రూ. 90.80

కేఎన్ఆర్ పాఠశాలపై విచారణకు త్రీమెన్ కమిటీ

నెల్లూరు (విద్య: నెల్లూరులోని బీవీనగర్ కేఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం సన్‌సైడ్ కూలి విద్యార్థి మృతి చెందిన ఘటనపై అధికారులు స్పందించారు. ఈ ఘటనపై ఇప్పటికే విచారణ పూర్తి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు నివేదికలను కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్, ఆర్జేడీకి పంపించారు. తాజాగా పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనుల నాణ్యతపై విచారణ చేపట్టాలని, జిల్లా విద్యాశాఖాధికారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, సమగ్రశిక్ష ఇంజనీరింగ్ అధికారులతో త్రీమెన్ కమిటీని నియమిస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త పింఛన్లు
ఎప్పుడిస్తారో!?

- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై అర్హుల ఆశలు
- వైసీపీ హయాంలో నిబంధనల కొర్రీ
- అర్హత ఉన్నా జాబితా నుంచి తొలగింపు
- ఆర్నెల్లకు ఒకసారే అవకాశం





ఈమె పేరు రమణమ్మ, సంగంలో ఒంటరి వృద్ధురాలు. రూ.200 ఉన్నప్పటి నుంచి పింఛన్ పొందుతోంది. ఎనిమిది నెలల కిందట కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని పింఛన్ ఆపేశారు. అధికారులను అడిగితే ఆధార్ నెంబరు మరో కరెంటు బిల్లుకు యాడ్ అయిందని చెప్పారు. చివరకు అధికారుల చుట్టూ తిరిగి దానిని తొలగించారు. ఆ తరువాత సచివాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకోమన్నారు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. అంతే అప్పటి నుంచి పింఛను కోసం ఎదురు చూస్తూనే ఉంది. ఈ పరిస్థితి ఈమె ఒక్కరిదే కాదు. జిల్లాలో ఎంతోమంది అర్హులు పింఛన్ కోసం ఇలా ఎదురుచూస్తున్నారు.

ప్రస్తుతం జిల్లాలో ఉన్న పింఛనుదారులు

పెన్షన్ రకం	లబ్ధిదారులు
వృద్ధాప్య	1,68,327
వితంతు	74,062
చేనేత కార్మిక	3,198
దివ్యాంగ	33,040
అమరావతిలో భూములు కోల్పోయి జిల్లాలో ఉన్నవారు	3
బోదకాలు	101
అభయహస్తం	4,856
సీకేడీ-ఈఎఫ్ఆర్	17
సీకేడీ-సీరం	55
సకేడీ-స్మాల్	9
సీకేడీయూ పెన్షన్లు	757
డప్పు కళాకారులు	3,485
మత్స్యకారులు	4,977
కిడ్నీ వ్యాధిగ్రస్తులు	53
కుష	383
పక్షవాతం	865
తీవ్ర కండరాల బలహీనత	439
కళాకారులు	334
సైనిక సంక్షేమ పెన్షను	8
తీవ్ర హిమోఫీలియా	39
సికిల్ సెల్ వ్యాధి	10
ట్రాన్స్‌జెండర్	122
ఒంటరి మహిళ	11,071
తలసీమియా	46
కల్లుగీత కార్మికులు	2,596
చర్మకార	2,687
హెచ్ఐవీ	2,244

సంగం, ఆగస్టు 20 : జిల్లాలో అర్హత ఉండి పింఛన్‌కు నోచుకోని ఎందరో కూటమి ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. గత టీడీపీ హయాంలో పింఛన్ల కోసం ఎప్పటికప్పుడు అర్హులు దరఖాస్తు చేసుకొని నమోదు చేయించుకునే అవకాశం ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక అర్హత ఉండి ఈ నెలలో దరఖాస్తు చేసుకుంటే మరుసటి నెలలో పింఛన్ మంజూరని గొప్పలు చెప్పేది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే నమోదుకు అవకాశం ఇచ్చింది. దీంతో వైసీపీ హయాంలో పింఛన్ మంజూరు అదో పెద్ద ప్రహసనంలా మారింది.

పింఛన్ పెంపు

జిల్లాలో 3,13,784 మంది అన్ని రకాల పింఛన్ లబ్ధిదారులు ఉండగా, వీరికి ప్రతి నెల సుమారు రూ.132.58 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మొదటి నెలలోనే రూ.3 వేలు ఉన్న పింఛన్‌ను 4 వేలకు పెంచింది. దివ్యాంగుల పింఛన్ రూ.3వేల నుంచి ఆరు వేలకు, వైకల్యంతో మంచానికే పరిమితమైతే రూ.15వేలు పెంచింది. ఈ నేపథ్యంలో అర్హత ఉన్న వారెందరో తమకు పింఛన్ పొందే అవకాశం ఎప్పుడు దక్కుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. వైసీపీ హయాంలో నిబంధనల వడపోతతో అనర్హత బారినపడి పింఛన్లు కోల్పోయిన వేలాదిమంది ఇప్పుడు ఎదురుచూస్తున్నారు.

నిబంధనల పేరుతో...

2014 - 19 మధ్య టీడీపీ హయాంలో పింఛన్ నమోదు ప్రక్రియ నిరంతరంగా సాగుతుండేది. అర్హత కలిగిన వారు వారంలో ఏ రోజైనా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వీలు ఉండేది. వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులకు ఆ మరుసటి నెల నుంచే పింఛన్ పొందే అవకాశం ఉండేది. వైసీపీ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితా రూపొందించే విధంగా మార్పులు చేసింది. ఏటా జూన్, డిసెంబరు నెలల్లో కొత్త జాబితా రూపొందిస్తామని చెప్పిం ది. అయితే గడిచిన ఐదేళ్లలో ఒక్క సారి కూడా ఆ ప్రక్రియ ప్రకారం జాబితాలను రూపొందించిన దాఖలాలు లేవు. కానీ అనేక కుంటి సాకులు చూపి తొలగింపులను మాత్రం నిరంతర ప్రక్రియగా చేసుకుందని పలువురు విమర్శిస్తున్నారు. కరెంటు బిల్లులు, ఇన్‌కంటాక్స్, నాలుగు చక్రాల వాహనం, ఇళ్ల స్థలం, పొలం ఎక్కువగా ఉందని తదితర కారణాల పేరిట వేలాది మందిని అనర్హులను చేసి తొలగించారు. పొరపాటున ఒక సారి పింఛన్ తిరస్కరణకు గురైతే మరో ఆరు నెలలపాటు ఆగాల్సి వచ్చేది. ఇలా అర్హులైన లబ్ధిదారులు వేలాదిమంది ఏళ్ల తరబడి పింఛన్ కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఇటువంటి వారంతా కూటమి ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా

8 నెలల కిందట నా భర్త చనిపోయాడు. అప్పటి నుంచి వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఎదురుచూస్తున్నా. సచివాలయం సిబ్బందిని అడిగితే సైట్ వదల్లేదని చెబుతున్నారు. ఎప్పుడు వదులుతారో, పింఛన్ ఎప్పుడు మంజూరవుతుందో.

- జె నిర్మల, సంగం




ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

దోమలతో జాగ్రత్త : డీఎంహెచ్‌వో

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 20 : దోమల బారిన పడకుండా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా నెల్లూరులోని మోడల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. దోమల వల్ల మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని తన పరిశోధనల ద్వారా వెల్లడించిన శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి డీఎంహెచ్‌వో, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మలేరియాతో పాటు డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు దోమల వల్లే వస్తాయన్నారు. హుస్సేనమ్మ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం దోమల నివారణకు డ్రైడేగా నిర్వహిస్తున్నామని చెప్పారు. దోమల కుట్టకుండా పొడువాటి దుస్తులు ధరించాలని, దోమతెరలు వాడాలని కోరారు. దోమల నియంత్రణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కల్యాణ్, మలేరియా నివారణ సహాయ అధికారి నాగార్జునరావు, శ్యాంసన్‌బాబు, జయరాం, హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నియంత పాలనకు ప్రజలే బుద్ధి చెప్పారు!

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 20 : రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి నియంత పాలనకు ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నెల్లూరులో సీపీఐ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులు, ఉద్యమాల అణచివేత, అభివృద్ధి శూన్యం.. ఇలా ఎన్నో వైఫల్యాల వల్ల వైసీపీని 11 స్థానాలకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీ 400 లోక్‌సభ సీట్లు వస్తాయని ఎన్నికలకు ముందు తెగ ప్రచారం చేసిందని అయితే చావుతప్పి కన్ను లొట్ట పోయిందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు లేకపోయినా ప్రజలతో కలిసి సీపీఐ ప్రజాపోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ హరనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నాయకులు సయ్యద్ సిరాజ్, నందిపోగు రమణయ్య, మధు, అరిగెల సాయి, సురేష్, షాన్‌వాజ్, మున్వర్, శంకర్, కిశోర్, రామరాజు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో బదిలీల ఫైల్ సిద్ధం

- ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారికి స్థానచలనం

నెల్లూరు(సిటీ): నెల్లూరు నగర పాలక సంస్థలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధమైంది. ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పాతుకుపోయిన వారిని లక్ష్యంగా చేసుకుని జాబితా తయారు చేసినట్లు సమాచారం. అంతర్గతంగానే ఈ బదిలీలు నృపటికీ ఎవరికి ఏ విభాగంలో స్థానం కల్పిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ, పరిపాలన విభాగాల్లో ఏళ్లగా పాతుకుపోయిన వారు ఎక్కువగా ఉండటంతో ఆ విభాగాలపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిసింది. కాగా, ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న అధికారుల వివరాలు ఈఎన్‌సీకి పంపేందుకు జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం.


23న జాబ్‌మేళా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 20: ఈ నెల 23వ తేదీ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామ్ ఫైనాన్స్‌లో వివిధ రకాల పోస్టులకు ఎంపికలు జరుగుతాయని 18 నుంచి 40 ఏళ్లలోపు వయసు, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చ న్నారు. ఉద్యో గాలకు ఎంపికైన వారికి రూ.18 వేలకుపైగా వేతనం ఇస్తారన్నారు. క్రెడ్ రైట్ ఫైనాన్స్ సంస్థలో లోన్స్ ప్రోసెస్ ఆఫీసర్ పోస్టులకు కూడా ఇంటర్వ్యూలు జరు గుతాయని తెలిపారు. ఏదైనా డిగ్రీ అర్హత 20 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ.16 వేల వేతనం, ఇన్సెంటివ్ ఇస్తారని తెలిపారు. క్రెడ్ యాక్సిజ్ గ్రామీన్ లిమిటెడ్‌లో ప్రోసెస్ ట్రైనీ ఆఫీసర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఏదైనా డిగ్రీ అర్హత, 20 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి రూ.16,269 వేతనం, ఇన్సెంటివ్ ఇస్తారని తెలిపారు. ఫ్లిప్‌కార్ట్‌లో డెలి వరీ బాయ్స్, ఆఫీస్ అసోసియేట్ పోస్టులకు పదో తరగతి నుంచి ఎంబీఏ వరకు విద్యార్హతలు కలిగి, 20 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు జీతం ఇస్తారని తెలిపారు. ఆస క్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 23న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

సోమశిలలో 25.80 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 20: సోమశిల జలాశయంకు ఎగువ నుంచి మంగళవారం 11,455 క్యూసెక్కుల ప్రవా హం ఉన్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 25.80 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ డెల్టా, ఉత్తర, దక్షిణ కాలు వలకు 210 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రికార్డుల కంప్యూటరైజేషన్ వేగవంతం చేయాలి



కమ్మవారిపాలెం సొసైటీ రికార్డులు పరిశీలిస్తున్న సీఈవో

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 20: సహకార సంఘాల రికా ర్డుల కంప్యూటరైజేష న్‌ను వేగవంతం చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక కమ్మవారిపాళెం సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లా డారు. రూ.300 షేరు ధనం కలిగిన సభ్యులు ఈకేవైసీ పత్రాన్ని సమర్పించి సభ్యత్వం ను పునరుద్ధరించాల న్నారు. ఈ నెల 31లోపు ఈకేవైసీ పత్రాలు ఇవ్వని సభ్యు లను సంఘ సభ్యత్వం నుంచి తొలగించా లన్నారు. వాయిదా మీరిన బకాయి దారులపై చట్టప రమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి బ్రాంచ్ సూపర్‌వైజర్ రాజశేఖర్, సొసైటీ సీఈవో లోక్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

'అప్సడా' నిబంధనలు పాటించాలి

- 20 రకాల యాంటీబయోటిక్స్‌పై నిషేధం
- మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు



ఆక్వా దుకాణంలో మందులను తనిఖీ చేస్తున్న మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, అధికారులు

నెల్లూరు (వ్యవసాయం), ఆగస్టు 20 : ఆక్వారంగ అభివృద్ధి, సుస్థిరత, క్రమబద్ధీకరణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2020లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టం చేసిందని, దాని నిబంధనలను అందరూ పాటించాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వర రావు తెలిపారు. నెల్లూరులోని రాజశేఖర్ ఆక్వా దుకాణాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్సడా చట్టం ప్రకారం రొయ్యలు, చేపల సాగు వాటికి అనుబంధంగా నిర్వహించే ఐస్ ప్లాంట్లు, చేప, రొయ్యల మేత ఉత్పత్తి కేంద్రాలు, చేప, రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు, ఆక్వా షాపులు, ప్రాసె సింగ్ ప్లాంటు ఇతర మత్స్య సంస్థలు తప్పనిసరిగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ నియమ నిబంధనల ప్రకారం ఆక్వా సాగులో వినియోగించే కెమికల్స్, మందులు, ప్రో బయోటిక్స్‌కు కూడా అనుమ తులు పొంది ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20 రకాల యాంటీ బయోటిక్స్ వాడకాన్ని నిషేధించిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో నెల్లూరు ఏడీఎఫ్ వీ రంగనాథ్‌బాబు, ఎఫ్‌డీవో సంజయ్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు.. అరకొర నిర్మాణాలు

- నియోజకర్గానికి మంజూరైన గృహాలు 7,833.. పూర్తయినవి 1,302
- వాటిలోనూ నాసిరకం నిర్మాణాలు
- వివిధ దశల్లో మిగిలినవి..



ఆత్మకూరు అర్బన్ పరిధిలోని పమిడిపాడు వద్ద లేఅవుట్లలో బేస్‌మెంట్ స్థాయిలోనే ఆగిన పక్కాగృహాలు

ఆత్మకూరు, ఆగస్టు 20: పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని వైసీపీ ప్రభుత్వం బీరాలు పలికింది. ఇళ్ల పథకం కింద లేఅవుట్లు వేసింది. భూములు అందుబాటులో లేని కొన్నిచోట్ల ప్రైవేటుగా భూ ములు కొనుగోలు చేసింది. ఈ క్రమంలో కొందరు వైసీపీ నేత లు రంగప్రవేశం చేసి అధిక ధరలకు కొనుగోలు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో అనువుగా ని చోట ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు అరాకొరగానే మిగిలిపోయాయి.

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో..

మొత్తం 7833 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో కేవలం 1302ఇళ్లు మా త్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆత్మకూరు అర్బన్‌లో మినహా మిగిలిన అన్ని మండలాల్లో 10శాతం ఇళ్లు పూర్తయిన దాఖ లాలు లేవు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైంది. అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు పూర్తిస్థాయిలో నిర్మాణానికి నోచుకోలేదు. విద్యుత్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది. పలు కాలనీల్లో కంపచెట్లు పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి.

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి
ఏఎస్‌పేట	1094	51
అనంతసాగరం	1070	83
ఆత్మకూరు రూరల్	572	68
చేజర్ల	1011	44
మర్రిపాడు	948	48
సంగం	859	43
ఆత్మకూరు అర్బన్	2279	965
మొత్తం	7833	1302

నాసిరకంగా నిర్మాణాలు

నియోజకవర్గంలో 2095పక్కాగృహాలను 23మంది కాంట్రాక్టర్లు నిర్మిస్తున్నా రు. వీటిలో కేవలం 68ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కిటికీలు, స్లాబ్ స్థాయి లో 412, స్లాబ్‌లు వేసినవి 82ఉన్నాయి. బిలో బేస్‌మెంట్ స్థాయిలో 104, ప్లిన్త్ బీమ్ స్థాయిలో 94, లెంటల్ లెవల్‌లో 73ఉన్నాయి. వారు నిర్మించిన పక్కా గృహాలు నాసిరకంగా ఉన్నా యని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీ పీ నాయకులే కాంట్రాక్టర్లు కావడంతో కొన్ని కాలనీ ల్లో సిమెంట్ రాళ్లతో పునాదులు కట్టారు. ఆ రాళ్లు నాసిరకంగా ఉండడంతో చాలాచోట్ల దెబ్బతిన్నాయి. ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు పనులు అర్ధాంతరంగా ఆపేశారు. ఈ పనుల నాణ్యతపై థర్డ్ పార్టీ పరిశీలన నామమాత్రంగా సాగిందని విమర్శలు న్నాయి. ప్రస్తుతం విజిలెన్స్ అధికాకారులు విచారణ చేయనున్నారు. విచార ణలో ఏ మేరకు అక్రమాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సి ఉంది.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రాయపేట రోడ్డుకు మోక్షమెప్పుడో..!?

- వాహన రాకపోకలకు తప్పని తిప్పలు
- దూరం పెరిగినా చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా ఉన్న రాయపేట రోడ్డు

అల్లూరు, ఆగస్టు 20 : మండలంలోని రాజుపాళెం-ఇస్కపల్లి (ఆర్ఐ) రోడ్డు నుంచి రాయపేట వరకు ఉండే రోడ్డు దుస్థితిలో ఉండడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతోన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాంగా మారడంతో దీనికి ఎప్పుడు మోక్షం లభిస్తోందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వంలో నాయకులు, పాలకులు రోడ్డు నిర్మాణం చేయిస్తామని మాయమాటలు చెప్పి కాలయాపన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక తమ రోడ్డుకు మోక్షం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 3 కి.మీ దూరం ఉండే ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఇటు వైపు ప్రయాణాలు మానుకున్న ప్రజలు ఉడ్‌హౌస్ పేట మీదుగా వెళ్తున్నారు. దూరమైనప్పటికీ తప్పని పరిస్థితుల్లో ఈ రోడ్డులోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రాయపేట, ఆర్ఐ రోడ్డు పక్కల ఉన్న చిల్లచెట్లు ఏపుగా పెరిగిపోయి రోడ్డును మూసేస్తున్నాయి. ఇకనైనా నాయకులు, అధికారులు ఈ రోడ్డును నిర్మించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మొక్కుబడిగా మర్రిపాడు మండల సమావేశం



ప్రగతి నివేదికను చదివి వినిపిస్తున్న ఏపీవో నారాయణ

మర్రిపాడు, ఆగస్టు 20: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సా గింది. పలు శాఖల అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టారు. కేవలం పంచాయతీ కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. ఎక్కువ మంది ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైసీపికి చెందిన సభ్యులు కావటంతో వారు సమావేశాలకు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. మూడునెలలకు ఒకసారి తప్పక మండల సమావేశం నిర్వహించాల్సి ఉండటంతో ఈవోపీఆర్డీ మస్తాన్‌ఖాన్ సమావేశాన్ని నిర్వహించారు. ఏపీవో, ఇరిగేషన్ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు.

యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాంలను అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, ఆగస్టు 20: మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్రావుపల్లి ఎస్టీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 36మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడుజతల యూనిఫాంలను మంగళవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని తమ పిల్లలను బాగా చదివించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యుడు రాంపల్లి ప్రసాద్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు సుభద్ర

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని బూత్ లెవల్ అధికారులు ఈ నెల 20నుంచి అక్టోబరు 18వరకు ఇంటింటా సర్వే చేపట్టాలని తహసీల్దారు సుభద్ర తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌వోలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఇంటింటా సర్వేలో భాగంగా 18ఏళ్లు నిండిన వారు ఓటుహక్కు దరఖాస్తు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. డోర్ నెంబర్ జీరో ఉన్న వాటిని సరిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డీటీ జహీర్‌ఖాన్, సీ నియర్ అసిస్టెంట్ సందానీ, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్య దారుణం

- కొవ్వొత్తుల ర్యాలీలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ సభ్యులు



ఉదయగిరి రూరల్: కొవ్వొత్తుల ర్యాలీలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ సభ్యులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: కోల్‌కతా మెడికల్ విద్యార్థిని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం ప ట్టణంలో కొవ్వొత్తులు ప్ర ద ర్శిస్తూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రోజ్‌దార్ మన్సూర్, కాకు వెంకటయ్య, బకీరు జాషువా, షేక్ ఎండీ ఖాజా, మన్సూర్‌అలీ, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం: కోల్‌కతా వైద్యురాలిపై హత్యా కాండను నిరసిస్తూ జనసేన నాయకులు నిరసన చేపట్టారు. స్థానిక హైస్కూల్ సెంటర్ నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మావిళ్ల ఆనంద్, మదన్ యాదవ్ పాల్గొన్నారు.



సంగం: నిరసన ర్యాలీలో పాల్గొన్న జనసేన నాయకులు, విద్యార్థులు

బీటీఏ సభ్యత్వ నమోదు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మంగళవారం ఉదయగిరిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై బీటీఏ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మణి, సుబ్బు, రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కార్యదర్శి కృష్ణప్రసాద్, ఖాజారంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌ను అడ్డుకున్న ఫ్యాప్టో నాయకులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు మంగళవారం చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఫ్యాప్టో నాయకులు అడ్డుకున్నారు. అనంతరం సమస్యలపై ఎంఈవోలకు వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, షేక్‌ఎండీ ఖాజా, ఫణిరాజు, షబ్బీర్, బలరాం పాల్గొన్నారు.

పార్థీనియంపై అవగాహన

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: పార్థీనియం వారోత్సవాల్లో భాగంగా స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలోని మొదటి సంవత్సర విద్యార్థులకు మంగళవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. పార్థీనియం అనేది విషపూరిత, హానికరమైన మొక్కన్నారు. ఈ కలు పు మొక్క జీవవైవిధ్యం, వ్యవసాయ ఉత్పాదక నష్టాన్ని తగ్గించడంతో పాటు చర్మ అలర్జీ, గ వత జ్వరం, మానవుడు, జంతువుల్లో శ్వాస సమస్యలకు కారణవుతుందన్నారు. కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రమేష్, ప్రొఫెసర్ నారాయణస్వామి, సునీత పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వరికుంటపాడు, ఆగస్టు 20: మండలంలోని పశువులకు సెప్టెంబరు 18వ తేదీ వరకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి ఎస్‌వీ రాఘవేంద్రశర్మ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా అన్ని పంచాయతీల్లో వ్యాధి లక్షణాలు, సంభవించే నష్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. నాలుగు నెలలు దాటిన పశువులను గుర్తించి టీకాలు వేయనున్నట్లు చెప్పారు. పాడిరైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



ఉదయగిరిలో వైద్యఆరోగ్య సిబ్బంది ర్యాలీ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మంగళవారం ఉదయగిరి పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారిణి శివకల్పన నోబెల్ పు రస్కార గ్రహీత సర్ రొనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోమకాటుకు గురికాకుండా జాగ్ర త్తలు తీసు కోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, చెన్నయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 20: కృష్ణంపల్లిలో సీతారామచంద్ర ఆలయంలో ఐదు రోజులు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవా రంతో ముగిశాయి. చివరిరోజు గ్రామ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా చేపట్టారు. అనంతరం ఉట్టి మహోత్సవం, వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు చేపట్టారు. కేరళ బృందంతో నిర్వహించిన డప్పు వాయిద్యాలు భక్తులను అలరించాయి. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

వరికుంటపాడు, ఆగస్టు 20: అంతంతమాత్రంగా విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలను నిజం చేసి చూపిస్తున్నారు సొసైటీ కార్యాలయ ఉద్యోగులు. స్థానిక కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమే గోదాం అద్దెకు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఆ ఫ్లెక్సీలో అప్పటి ఛైర్మన్ పేరు, ఫోన్ నంబర్లు నేటికీ అలాగే దర్శనమిస్తుండటం విశేషం.

స్థానిక నేతకు అభినందనలు

సంగం, ఆగస్టు 20: జనసేన పార్టీ తరుపున అత్యధిక క్రియాశీలక సభ్యత్వాలు చేయించిన స్థానిక నేత దాడి భాను కిరణ్‌ను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ మంగళవారం అభినందించారు. భాను కిరణ్ అత్యధికంగా 316 క్రియాశీలక సభ్యత్వాలు చేయించారన్నారు. ఆయన్ను శాలువాతో సత్కరించి పార్టీ తరుపున సర్టిఫికెట్ అందజేశారు.

దసరా ఉత్సవాల గోడపత్రికల ఆవిష్కరణ



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కమిటీ సభ్యులు

కావలి, ఆగస్టు 20: పట్టణంలోని 30వ వార్డులో వెలసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్‌లో జరిగే దసరా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం కావలి ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం దేవస్థాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 10 రోజుల పాటు ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు ప్రత్యేక అలంకారంలో అమ్మవారి దర్శనం ఉంటుందని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

కావలిటౌన్, ఆగస్టు 20: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సందీప్ కంటి పరీక్షలు నిర్వహించడంతోపాటు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా సెల్‌ఫోన్‌లో చదవడం అలవాటుగా మారిందని, సెల్‌ఫోన్‌లో మెటీరియల్ చదవడం కంటే పేపర్ రూపంలో మెటీరియన్ చదవడం మేలని సూచించారు. కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడుతూ నేటి సమాజంలో కంటి సమస్యలు ఎక్కువయ్యాయని, విద్యార్థులు ప్రధానంగా కంటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ రాంబాబు, పీఆర్‌వో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

- సాయిపేటలో ప్రారంభమైన ఉత్సవాలు
- రేపు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి రాక



కొండాపురం : హోమ పూజలకు సిద్ధమైన యాగశాల

కొండాపురం, ఆగస్టు 20: మండలంలోని సాయిపేటలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. దీనికి సంబంధించి మూడు రోజులపాటు జరిగే విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు యాగశాలలో మహాగణపతి పూజ, దీక్షా కంకణధారణ, వరుణపూజ, తీర్థానయనమ్, అఖండ ప్రజ్వలన, ప్రధాన కలశ, కర్కరీ కలశ, వర్ధని కలశ, వరుణ కలశములస్థాపన, విగ్రహముల యాగశాల ప్రవేశం, వాస్తుమండల, యోగిని మండల, క్షేత్రపాలక మండల, నవగ్రహ మండల దేవతా ఆవాహన, గ్రామ దేవత ఆవాహన తదితర పూజలు జరిగాయి. అభయాంజనేయస్వామి, శిఖర కలశం, మహాగణాధిపతి విగ్రహాలను జలాధివాసాన్ని రుత్వికులు వేదమంత్రోశ్చరణల నడుమ నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు పంచామృతం, తీర్థప్రసాదం అందచేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను నిర్వాహకుడు ఎమ్.సుబ్బరావు పర్యవేక్షించారు.

సాయిపేటలో గురువారం జరగనున్న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొంటారని గ్రామ మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీనరసింహులు తెలిపారు.

సుందరగిరివారికండ్రికలో...

బిట్రగుంట : బోగోలు మండలం సుందరగిరివారికండ్రికలో అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఉదయం బ్రహ్మశ్రీ ఈపూరు గోవిందరాజు ఆచారి బృందంచే గణపతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సుదర్శన హోమం, తామర పూవ్వులతో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. జలాధివాసంలో ఉన్న అభయ ఆంజనేయస్వామి, శంఖు చక్ర నామాలును భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



బిట్రగుంట : సుందరగిరి కండ్రికలో గణపతి పూజలు

దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కావలిటౌన్, ఆగస్టు 20: దేశాభివృద్ధి దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ పుణ్యమేనని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ట్రంకురోడ్డులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సీనియర్ కార్యకర్తలకు తినిపించారు. ఈ సంద్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో గాంధీ కుటుం బం త్యాగాలను జాతి మరవదని, పంచాయితీల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, ఐటీ తదితర అభివృద్ధి పనులు చేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ కన్వీనర్ కమలాపురి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, నాయకులు కంచి వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య, జరీఫ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

30 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

లింగసముద్రం, ఆగస్టు 20 : మండలంలోని పశువులకు మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని వీఆర్ కోట పశు వైద్యాధికారి వై శ్రీకాంత్ చెప్పారు. మొదటి రోజు మండలంలోని విశ్వనాథపురంలో ఆయన పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువులకు ఉచితంగా వేస్తున్న ఈ టీకాలను పశుపోషకులు తమ పశువులకు వేయించుకోవాలన్నారు. ఈ వ్యాధి సోకితే పాల దిగుబడి తగ్గి, ఆ పాలు తాగిన దూడలు మరణించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే చూడి గేదెలు ఈసుకు పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ సీహెచ్ మహేంద్ర, పశు సంవర్ధక సహాయకులు జె.ప్రవీణ్, చౌదయ్య, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

కందుకూరు : మండలంలోని కోవూరు పశువైద్య కేంద్రంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచు ఆవుల మాధవరావు మంగళవారం ప్రారంభించారు. పశువైద్యాధికారి డాక్టరు సుధాకర్ గేదెలు, దున్నలతో పాటు ఆవులు, ఎద్దులకు టీకాలు వేశారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న బావులు..!



కడనూతల బావిలో అడుగంటిన నీరు

బిట్రగుంట, ఆగస్టు 20: బోగోలు మండలంలో ఎండలు మండిపోతున్నాయి. దీంతో బావులు, చెరువుల్లో నీరు అడుగంగి ఎండుతోన్నాయి. వారం రోజులుగా ఎండలు వేసవి కాలాన్ని తలపిసుండడంతో ప్రజలు తాగునీటికి, ఇంటి నుంచి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లిమడుగు పంచాయతీ కడనూతల గ్రామ చెరువు పూర్తిగా ఎండిపోయింది. గ్రామ బావుల్లో నీరు అడుగంటిపోయింది. ఫలితంగా తాగునీటి సమస్య క్రమంగా పెరుగుతోంది. గ్రామానికి పంచాయతీ నీరు రెండు రోజులకు ఒక్కసారి అరకొరగా వదులు తున్నారని స్థానికులు అంటున్నారు. చెరువు పూర్తిగా ఎండిపోవడం వలన మూగజీవులు తాగేందుకు నీరు లేక అలమటిస్తున్నాయి. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

అల్లూరు, ఆగస్టు 20 : మినర్వా గ్రాండ్ హోటల్స్ విజయ హిల్స్ అధినేత, రామకృష్ణ విద్యాసంస్థల అభివృద్ధి కమిటీ సభ్యుడు అల్లంపాటి లోకేశ్వరరెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నార్తుఆములూరులోని చైల్డ్ ఆశ్రమంలో బాలలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయూబ్, సుభాష్, పవన్, కళ్యాణ్, సునీల్, కోటి, మదన్, రాజేష్, కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ చెట్టు వద్ద ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ

అల్లూరు, ఆగస్టు 20 : అల్లూరు బీసీ కాలనీలో వెలసిఉన్న పోలేరమ్మ చెట్టు వద్ద మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ప్రతిఏటా నిర్వహించేలా గంగపెట్టె, వీరతాళ్లతో అమ్మవారికి ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పొంగళ్లు నైవేద్యం సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. తప్పెట్లు, ప్రత్యేక అలంకారంతో అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టరు పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న ట్రాక్టరు

కొండాపురం, ఆగస్టు 20: అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టరును కొండాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల మేరకు.. మర్రిగుంటలో మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో పోలీసులు దాడి చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించాలి

కందుకూరు, ఆగస్టు 20: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించాలని సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 1వ తేదీన చెల్లించాల్సిన జీతాలను 20వ తేదీ వచ్చినా చెల్లించకపోవటంతో కార్మికుల కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు ఎస్‌ఏ గౌస్, ఎం.ప్రసాద్, డీఎం రాయుడు తదితరులు కమిషనర్‌కు విజ్ఞప్తిచేయగా తక్షణ చర్యలు చేపట్టి జీతాలు వారి ఖాతాలకు జమచేయిస్తానని హామీ ఇచ్చారు.

నిబంధనలకు విరుద్ధంగా లారీల పార్కింగ్

● తరచూ ప్రమాదాలు ● పలువురి మృత్యువాత

వెంకటాచలం, ఆగస్టు 20 : మండల పరిధిలోని జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారి మధ్యలో డివైడర్లను మొక్కలు, పచ్చిగడ్డితో సుందరంగా తీర్చిదిద్దారు. అయితే వీటిని పర్యవేక్షించడంలో హైవే సిబ్బంది విఫలమయ్యారు. దీంతో హైవే పక్కన ఉన్న గ్రామాల నుంచి పశువులు, ఆవులు మేత కోసం జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి మధ్యలోని డివైడర్లలో ఉన్న గడ్డిని పశువులు మేసి ఒక్కసారిగా హైవేపైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.ఇప్పటి వరకు ఎన్నో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారు. దీంతోపాటు రహదారిపై ఉన్న బ్యాంకులు, ఏటీఎం సెంటర్లు, దాబాల ప్రాంతాల్లో రహదారిపైనే లారీలు, ఇతర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఇలా చేస్తుండడం వల్ల కూడా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయితే హైవే పోలీసు మొబైల్ వాహనం నామమాత్రంగానే తనిఖీలు చేస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హైవేపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు వాహనచోదకులు, మండల ప్రజలు కోరుతున్నారు.



హైవేపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన లారీలు

25న నెల్లూరులో ఆవాజ్ ప్రదర్శన

కోవూరు, ఆగస్టు 20 : వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 25న నెల్లూరులో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.రషీద్ తెలిపారు. స్థానిక సీతాపోలయ్య భవనంలో మంగళవారం జరిగిన ఆవాస్ కమిటీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ముస్లింల హక్కులను కాలరాసేందుకు సిద్ధమైందన్నారు. అందుకు నిరసనగా 25న జరిగే ప్రదర్శనలో మైనారిటీవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆవాజ్ మండల కమిటీ నాయకులు, సర్దార్, జాన్‌బాషా, మహబూబ్‌బాషా, కాలేషా, షేక్.బాబు, తదితరులు పాల్గొన్నారు.

జట్లకొండూరులో డీఎల్‌పీవో తనిఖీ

మనుబోలు, ఆగస్టు 20: మండలంలోని జట్లకొండూరు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డీఎల్‌పీవో రికార్డులు పరిశీలించారు. ఇటీవల జట్లకొండూరు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ సస్పెండ్ అయిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో నెల్లూరు డీఎల్‌పీవో శ్రీనువాసులు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని 2015 నుంచి రికార్డుల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ జీవీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత మృతికి సంతాపం

ఇందుకూరుపేట, ఆగస్టు 20 : మండలంలోని కొమరిక గ్రామానికి చెందిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు షేక్.అబ్దుల్ రెహమాన్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బీజేపీలో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.రెహమాన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు, ఆగస్టు 20: వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వనరుల కేంద్రం అధికారి గీతాకుమారి తెలిపారు. మండలంలోని సౌత్‌ఆములూరు, ముంగలదొరువు, కొత్తపాలెం గ్రామాల్లో మంగళవారం రైతులకు వరి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు భూసార పరీక్షలు, సేంద్రీయ ఎరువుల ఆవశ్యకత, రసాయనిక ఎరువుల వాడకం తగ్గింపు, వరి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చేవూరు పద్మావతి, మాజీ సర్పంచి చేవూరు శ్రీనివాసులు, వీఆర్‌వో రమణయ్య, పంచాయతీ సెక్రటరీ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే కురుగొండ్ల

రాపూరు, ఆగస్టు 20: స్థానిక లక్ష్మీపురంలో సిమెంట్ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 20 ఏళ్లుగా కాలనీలో రోడ్డు లేక వర్షాకాలం వస్తే ప్రజలు బురదలో నడవాల్సిన దుస్థితి ఉండేది. ప్రజల కష్టాలను గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిమెంటు రోడ్లు వేయిస్తామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లోనే రూ.13లక్షల సర్పంచి నిధులతో పనులు చేయిస్తుండటంతో లక్ష్మీపురం కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ఓటర్ల నమోదు

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు20: బుధవారం (నేటి) నుంచి అక్టోబరు 18వతేదీ వరకు ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఈఆర్‌వో అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొత్త ఓట్ల నమోదు, చేర్పులు, మార్పులకు సంబంధించి పలు సూచనలిచ్చారు. వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

బుచ్చి సీఐగా సురేంద్రబాబు



బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు 20: బుచ్చి నూతన సీఐగా సురేంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నెల్లూరు చిన్నబజారు పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేశారు. బదిలీపై గుంటూరు జిల్లాకు వెళ్లి అక్కడి నుంచి వచ్చి బుచ్చి సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 2007లో ఎస్ఐగా ఎంపికయ్యారు.

జొన్నవాడలో కాత్యాయనీ వ్రతం



వ్రతంలో పాల్గొన్న మహిళలు

బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు 20: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో శ్రావణమాసం మూడవ మంగళవారం సందర్భంగా కామాక్షితాయికి ఆలయ అర్చకులు కాత్యాయనీవ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. వ్రతంలో ముత్తైదువలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించాలి

వెంకటాచలం, ఆగస్టు 20 : మండలంలోని కనుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్థులు, టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. మంగళవారం వారు హెచ్ఎంతో మాట్లాడుతూ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిని విధుల నుంచి ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు.ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వారిని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్‌మస్తాన్‌బీ, సభ్యులు యు ధనుంజయనాయుడు, వల్లూరు రమేష్‌నాయుడు, వల్లూరు వంశీకృష్ణ, వంగర కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

దోమల నివారణపై ర్యాలీ

సైదాపురం,ఆగస్టు 20: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు నిత్యప్రశాంతి మాట్లాడారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలలో వైద్యులు శ్రావణి, కమ్యూనిటీ హెల్త్ అధికారి సొరకాయల శెట్టి, రాపూరు సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

బుచ్చిరెడ్డిపాళెం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ముందు జాగ్రత్తలు పాటించాలని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అహ్మద్‌బాబు తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ఆయన ఆసుపత్రి సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ముదుగా పీహెచ్‌సీలో రోటీన్ ఇమ్యునైజేషన్‌పై ఆరోగ్య సిబ్బందికి డాక్టర్ అహ్మద్‌బాబు, ప్రత్యూష అధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

మనుబోలు, ఆగస్టు 20: స్థానిక బాలికోన్నత పాఠశాలకు గూడూరు రోటరీక్లబ్ సభ్యులు కంప్యూటర్, ప్రింటర్‌ను మంగళవారం వితరణ చేశారు. వీటి అవసరాలపై హెచ్ఎం వసంతకుమారి క్లబ్ రొటేరియన్ కిరణ్ చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వాటిని క్లబ్ అధ్యక్షుడు బండి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు అనంతరం క్లబ్ అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జీజీ. నాయుడు, జనరల్ సెక్రటరీ రామ్‌ప్రసాద్, విద్యా కమిటీ కో-ఆప్షన్ సభ్యులు వరప్రసాద్, వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

మనుబోలు, ఆగస్టు 20: ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకచట్టాలు తీసుకురావాలని వైద్యురాలు గేయపూజిత అన్నారు. ఇటీవల కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం మనుబోలు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దేశవ్యాప్తంగా మెడికోలపై రకరకాలుగా దాడులు జరుగుతున్నాయని వారు వాపోయారు. కార్యక్రమంలో వైద్యురాలు మొహసీనా సుల్తానా, సీహెచ్‌వో రాజయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ సముదాయంలోనే వ్యాపారాలు



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్


బుచ్చిరెడ్డిపాళెం,ఆగస్టు20: ఇక నుంచి బుచ్చి కూరగాయలు, చేపలు, మాంసం వ్యాపారాలు నగర పంచాయతీ మార్కెట్ భవన సముదాయంలోనే నిర్వహించేలా మంగళవారం నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు వ్యాపారులకు అవగాహన కల్పించారు. బుచ్చిలోని జాతీయరహదారి, చెన్నూరురోడ్డు తదితర ప్రాంతాల్లో తోపుడుబండ్లు, వీధి వ్యాపారుల వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇకమీదట ఈ వ్యాపారులంతా మున్సిపల్ మార్కెట్‌లోనే విక్రయాలు జరుపుకునేలా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో చర్చించి కౌన్సిల్లో ఆమోదింపచేస్తామన్నారు. త్వరలోనే ఆక్రమణలు తొలగించి కూరగాయలు, మాంసం, చేపలు,గుడ్లు అన్నీ మార్కెట్‌లోనే విక్రయించేలా చేస్తామని రమణబాబు తెలిపారు.

పొదలకూరులో హనుమజ్జయంతి ఉత్సవాలు

పొదలకూరు, ఆగస్టు 20: పట్టణంలోని శ్రీవీర అభయాంజనేయుడి ఆలయంలో మంగళవారం రజక సేవా సంఘం ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం 13 మంగళవారాలపాటు హనుమజ్జయంతిని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మహిమాన్వితుడైన శ్రీఆంజనేయస్వామి ఆశీస్సులతో రాష్ట్రమంతా బాగుండాలని ఆయన ఆకాంక్షించారు. సోమిరెడ్డి వినతి మేరకు సీఎం చంద్రబాబు సోమశిల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడం సంతోషకరమన్నారు.

ఊటుకూరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం

సైదాపురం, ఆగస్టు 20: మండలంలోని ఊటుకూరులో సర్పంచు పెం చలయ్య పంచాయతీ తీర్మానం లేకుండానే అసంపూర్తి నిర్మాణ పనులు చే పట్టి, పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. రికార్డులో మా త్రం పనులు పూర్తి చేసినట్లు చూపించారు. ఈ విషయమై విచారణ చేపట్టాలని స్థానికులు రమణయ్య, అంకయ్య, సురేష్, గోవింద్ మంగళవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోని వివరాల మేరకు, ఈ ఏడాది జనవరి 29న రూ.60వేలు, జనవరి 30న పీడబ్ల్యూ ఎస్ వర్క్ కింద రూ.64,867ల తో శానిటేషన్ పనులు చేపట్టా రు. ఫిబ్రవరి 20న శ్మశానం ఫెన్సింగ్, శానిటేషన్ పనుల కింద బిల్లులు రూ.1,40,924, పెట్టారు. గ్రామంలోని ప్రధాన సీసీ రోడ్డుకు ఇరువైపులా జేసీబీతో డ్రైనేజీ కాలువలు తీశారు. ఈ పనులు అసంపూర్తిగా చేపట్టి వదిలేశారు. ఈసమస్యతో ఇళ్లలోని వాడిన నీరంతా కాల్వల తీసిన గుంతల్లోని లిచిపోతున్నాయి. రాత్రిళ్లు స్థానికులు డ్రైనేజీ కాలువల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉన్నందున దుర్గంధం వస్తుంది. దోమలు వ్యాప్తి చెందడంతో రోగాలు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వారు పే ర్కొన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ నిధులు దుర్వి నియోగంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక పెద్దూరు మంగలికట్టకు చెందిన నక్కా చిన్న (30) కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నెల్లూరు పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు తెలిపారు.

అన్నదమ్ముల ఘర్షణ : మినగల్లులో మంగళవారం రాత్రి అన్నదమ్ములు కడివేటి సుధాకర్‌రెడ్డి, కడివేటి సాయివంశీకృష్ణారెడ్డి మధ్య వివాదం చోటుచేసుకుని ఘర్షణ పడ్డారు. ఇరువురి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

మృగాళ్లను ఉరి తీయాలి

● బీజేపీ శ్రేణులు, వాకర్స్, పాస్టర్ల నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారానికి ఒడిగట్టిన మృగాలకు ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం పార్టీ మూలాపేట మండలం శాఖ ఆధ్వర్యంలో నగరంలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన కిరాతకమైన హత్యాచారం క్షమించరాని నేరమన్నారు. బంగ్లాదేశ్‌లో ఆత్యాచారాలు, హత్యలు, దాడులు, ఆలయాల ధ్వంసంతో అక్కడి హిందువులు నరకయాతన అనుభవిస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేందర్ సింగ్, రాజేష్, కందికట్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అకృత్యాలను అరికట్టాలి

నెల్లూరు(వైద్యం): మహిళలపై జరిగే అకృత్యాలను అరికట్టాలని పొగతోట రెసిడెన్షియల్ ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోదర డిమాండ్ చేశారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా మంగళవారం బృందావనంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, బలరామయ్యనాయుడు, లలిత, శిరీష, రమాదేవి, జయప్రకాష్, విద్యాధరి, పూర్ణిమ, నవ్య తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కఠినంగా శిక్షించాలి

నెల్లూరు (సాంస్కృతికం) : కోలకత్తాలో జరిగిన వైద్యురాలి హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో గాంధీబొమ్మ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ నేషనల్ కన్వీనర్ ఏ జయప్రకాష్, వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసురత్నం, ఉపాధ్యక్షుడు కేఎస్.రాజు, ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నా పేరిట ఫ్లెక్సీలు కట్టొద్దు : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



శంకుస్థాపనలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, ఆగస్టు 20 : తాను పాల్గొనే కార్యక్రమాల కోసం తన పేరిట ఎలాంటి ఫ్లెక్సీలు కట్టొద్దని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. నగరంలోని 20వ డివిజన్ వనంతోపు సెంటర్‌లో రూ.33 లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు నగరంలో ఎక్కడపడితే అక్కడ కట్టడం వల్ల చిరు వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఫ్లెక్సీలు, బొకేలు, శాలువాలు ఇచ్చే బదులు పేదలకు పట్టెడన్నం పెట్టాలని కార్యకర్తలకు సూచించారు. హంగు, ఆర్భాటాల వల్ల ఏమీ రాదని, దానికి ఖర్చు చేసే డబ్బును సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ మహేష్, నాయకులు సాయిబాబా, ఖాదర్‌బాషా, రవి, రమణయ్య, రవీంద్ర పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు హరనాథపురం కూడలి వద్ద సూర్య నమస్కారాల విగ్రహాల ఏర్పాటు, సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

అధికారులపై చర్యలు తీసుకోండి

● సోమిరెడ్డికి వికలాంగుల సంఘం వినతి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 20 : ట్రైసైకిళ్ల తయారీ నిలిపివేతకు కారణమవుతున్న విభిన్న ప్రతిభావం తులశాఖ ఎండీ కుమార్‌రాజా, జిల్లా అధికారి నాగభూషణంపై చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డికి ఆయన నివాసంలో వినతిపత్రం అందచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సబ్సిడీ రుణాలు రద్దు చేశారన్నారు. ఎండీ చర్యల వల్ల దివ్యాంగులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. ట్రైసైకిళ్ల కర్మాగారాన్ని మూసి వేసే పరిస్థితి ఏర్పడిందన్నారు.

25 నుంచి కృష్ణమందిరంలో బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికకం), ఆగస్టు 20 : నగరంలోని మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని మందిరం కార్యదర్శి సుబ్బరామరాజు ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. 25వతేదీ అంకురార్పణ, కలిశ స్థాపన, 26వతేదీ తులసీ, బంగారు పుష్పాలతో సహస్ర నామార్చన, రాత్రి ఉట్టి మహోత్సవం, 27వతేదీ విశేష హోమాలు, 28వతేదీ ఉదయం శ్రీవారి కల్యాణం, రాత్రి నగరోత్సవం, 29వతేదీ రాత్రి ఊంజల్ సేవ, భాగవత ప్రవచనం జరుగుతాయని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

దివంగత రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 20 : దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నగరంలోని ఇందిరా భవన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించా రు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉండగా వైద్య విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధికి బాటలు వేశారన్నారు. రాజీవ్ స్ఫూర్తితో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కొత్త పుంతలు తొక్కుతోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వేటూరి శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి, ఫయాజ్, సంజయ్‌కుమార్, ఫజులుద్దీన్, మల్లి కిశోర్‌రెడ్డి, సయ్యద్ గౌస్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), ఆగస్టు 20 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రధాన అర్చకుడు రఘురామశర్మ భక్తులతో వ్రతం చేయించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, నవావరణ పూజలు, రాహుకాల పూజలు జరిగాయి. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ఈవో, సహాయ కమిషనర్ బీ వెంకట సుబ్బయ్య పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా ఉదయం వైభవలక్ష్మీ దేవి పూజ జరిగింది. ఆవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది. సాయంత్రం మూలవర్లకు విశేష పూలంగిసేవ, రాత్రి 108 మంది మహిళలకు పసుపు కుంకుమల పంపిణీ జరిగాయి. ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, ధర్మకర్తలు, ఉభయకర్తలు పర్యవేక్షించారు.





కాత్యాయనీ అలంకారంలో రాజరాజేశ్వరి అమ్మవారు, వ్రతానికి హాజరైన భక్తులు

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకోండి

మనుబోలు, ఆగస్టు 20: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో బాటనీ సబ్జెక్టు బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు ఖాళీగా ఉందని, నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంఎస్సీ బాటనీలో 50శాతం ఉత్తీర్ణత గలవారు మాత్రమే అర్హులని, నెలకు రూ. పదివేలు జీతం ఇస్తామని ఆయన తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

కొడవలూరు : మండలంలోని రామతీర్థం నుంచి నెల్లూరుకి అక్రమం గా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విడవలూరు : మండల పరిధిలోని రామచంద్రాపురంలో అనుమతులు లేకుండా మట్టి తోలుతున్న రెండు టిప్పర్లని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

18 ఏళ్లు నిండే వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి

● నగర కమిషనర్ సూర్యతేజ
● నేటి నుంచి ఇంటింటికి బీఎల్‌వోలు



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ/వెంకటేశ్వరపురం), ఆగస్టు 20 : వచ్చే ఏడాది జనవరి నాటికి 18 ఏళ్ల వయసు పూర్తయ్యే యువతి, యువకులను ఓటర్లుగా నమోదు చేయించాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్, సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మల్లవరపు సూర్యతేజ ఆదేశించారు .మంగళవారం ఆయన కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులందరి నుంచి ఫారం-6 ద్వారా ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఒక కుటుంబంలోని సభ్యులందరి ఓటు ఒకే చోట ఉండేలా బీఎల్వోలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా తయారీ అధికారులందరు సమన్వయంతో పని చేసి నాణ్యమైన ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. కాగా, పన్ను వసూళ్లపై ఆర్వో, ఆర్ఐలతో కలిసి నగరంలోని ప్రాంతాలలో కమిషనర్ పర్యటిం చారు.

● ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు పరిశీలన పక్కాగా చేయాలని నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ఏవో రాఘవేంద్రరావు ఆదేశించారు. కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో సమీక్షించారు. బుధవారం నుంచి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల పరిశీలన చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పుచేర్పులకు ఈ పరిశీలన పక్కాగా చేయాలని సూచించారు.

క్షయ నివారణకు వ్యాక్సిన్ తప్పని సరి

● ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 20 : జిల్లాలో క్షయ నియంత్రణకు బీసీజీ వ్యాక్సిన్ తప్పకుండా వేసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలియచేశారు. మంగళవారం నగరంలోని రైతుబజార్, కిసాన్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బీసీజీ వ్యాక్సిన్ పంపిణీ రికార్డులను పరిశీలించారు. వృద్ధులకు, క్షయ రోగుల సహాయకులకు బీసీజీ వ్యాక్సిన్ వేయాలని సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాపూస్ కళాశాలకు చేరుకుని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వేణుగోపాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రాల పరిశీలనలో ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

సెక్స్ వర్కర్ల హక్కులపై అవగాహన సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 20 : సెక్స్ వర్కర్ల హక్కులపై మే నెల 19న సుప్రీంకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులపై మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని బెంగళూరుకు చెందిన సంగ్రామ్ సంస్థ సహకారంతో సింహపురి స్వగతి మహిళా అభ్యుదయ సంఘం నిర్వహించింది. ముఖ్య అతిథిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కే వాణి పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సాయినాథ్, చైల్డ్ ప్రాజెక్టు అధికారి బీ సురేష్, సంగ్రామ్ సంస్థ ఆఫీసర్ విష్ణుతేజ, ప్రభుత్వ ఆసుపత్రి కౌన్సిలర్లు, న్యాయవాదులు, ఎస్ఎస్ ఎంఎస్ సీటీవో, సిబ్బంది పాల్గొన్నారు.



బర్డ్‌ను భ్రష్టుపట్టించారు!

ప్రత్యేకాధికారి రెడ్డెప్ప రెడ్డిపై అవినీతి ఆరోపణలు
ఇంప్లాంట్ల కొనుగోలులో అవినీతి వెలుగులోకి
రికార్డులు స్వాధీనం చేసుకున్న స్టేట్ విజిలెన్స్

తిరుపతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండం లోనే అతిపెద్ద ఆర్థోపెడిక్ ఆస్పత్రి.అంతేకాదు మూడున్నర దశాబ్దాలుగా లక్షలాదిమంది జీవితాలలో వెలుగులు నింపిన దవాఖానా. అయితే గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను, సంస్థలను నాశనం చేసినట్టే తిరుపతిలోని ప్రసిద్ధ వైద్య విజ్ఞాన సంస్థ బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్)ను కూడా భ్రష్టు పట్టించేసింది. తెల్ల రేషన్ కార్డుంటే పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు దొరికిన చోట ప్యాకేజీలు పెట్టి బేరాలాడారు. అడుగడుగునా రాజకీయ ప్రమేయం పెరిగిపోయింది. వైసీపీ నేతలు సిఫార్సు చేసిన వారికే కీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసేవారన్న ఆరోపణలొచ్చిన క్రమంలో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వైసీపీ హయాంలో బర్డ్‌లో ప్రత్యేకాధికారిగా చేరి డైరెక్టర్‌గా చెలామణి అయిన డాక్టర్ రెడ్డెప్ప రెడ్డిపై ఇటీవల ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టిపెట్టింది. ఆయన ఘనకార్యాలకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు మంగళవారం బర్డ్‌కు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

టీటీడీ నిర్వహణలో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న బర్డ్ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి గతి తప్పిపోయింది. బర్డ్‌కు కొత్త రెక్కలు తొడుగుతామని చెప్పుకొచ్చిన అప్పటి టీటీడీ అధికారులు సైతం రాజకీయ నాయకుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. తాజా మాజీ డైరెక్టర్ డాక్టర్ రెడ్డెప్ప రెడ్డిపై నిధుల దుర్వినియోగంతో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి నెలరోజుల క్రితం పెద్దఎత్తున ఫిర్యాదులందాయి. దీంతో రెడ్డెప్ప రెడ్డిని విచారణకు అనుమతించాలని గత నెలలో విజిలెన్స్ అధికారుల నుంచి టీటీడీ అధికారులకు మెమో జారీఅయింది. బర్డ్‌లో ఆయనకు విపరీతమైన అధికారాలు ఎవరిచ్చారు? ఇంప్లాంట్ల కొనుగోలులో ఆయన పాటించిన మార్గదర్శకాలు ఏమిటి? నోటిఫికేషన్ లేకుండా వైద్యులను ఎలా రెగ్యులర్ చేశారు? వైసీపీ సిఫారసు లేఖలతో కీళ్ల మార్పిడి కేసులు ఎన్ని చేశారు? తదితరాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టినట్టు తెలిసింది.

● ఎవరీ రెడ్డెప్ప రెడ్డి?

అనస్థీషియాలో డిప్లొమా చేసిన రెడ్డెప్ప రెడ్డి వైసీపీ నేతల అండదండలతో 2021లో బర్డ్ ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. బర్డ్‌లో అప్పటివరకు లేని ప్రత్యేకాధికారి పోస్టును ఆయనకోసమే అప్పటి టీటీడీ పెద్దలు సృష్టించారు. వైసీపీ పెద్దల ఆశీస్సులతో బర్డ్‌లో రెడ్డెప్ప రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అపోలో హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి గౌరవ డైరెక్టర్‌గా కొంత కాలం కొనసాగి తప్పుకున్నాక రెడ్డెప్ప రెడ్డి బర్డ్‌ను తనచుట్టూ తిప్పుకున్నారు. వైసీపీ నేతల సిఫారసు లేఖలకే కీళ్ల మార్పిడిలో ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా రాజంపేట వైసీపీ నేత ఆకేపాటి అమరనాథ రెడ్డి ఇంట్లో బర్డ్ వైద్యబృందంతో వెళ్లి మెడికల్ క్యాంప్ నిర్వహించినట్టు తెలిసింది. మే 31న అధికారికంగా రెడ్డెప్పరెడ్డి బర్డ్ ప్రత్యేకాధికారిగా రాజీనామా చేశారు. అయితే మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందన్న ఆశతో జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకు బర్డ్ డైరెక్టర్ బంగ్లాలోనే ఉన్నారు. ఆయన అంచనాలు తారుమారు కావడంతో బంగ్లా ఖాళీ చేసి జూన్ 6న హైదరాబాద్‌కు వెళ్లిపోయి, అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సీఈవోగా చేరినట్టు సమాచారం.

● రెడ్డెప్ప రెడ్డిపై ప్రధాన ఆరోపణలివే...



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బర్డ్‌లో ఇంప్లాంట్స్ కొనుగోలుకు కూడా రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. ఐదారు కంపెనీలు అర్హత సాధించినా ఒక కంపెనీకే ప్రాధాన్యం ఇవ్వడం, అదికూడా రూ.5వేల ధర ఎక్కువ ఉన్న ఇంప్లాంట్లను కొనుగోలు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం మూడు నెలల్లో ఆ కంపెనీకి చెందిన 366 ఇంప్లాంట్లను అమర్చారు. తక్కిన కంపెనీలవి 50లోపే వినియోగించారు.నాణ్యత లేకపోయినా, టెండరులో ఎక్కువ ధర ఉన్న ఇంప్లాంట్లనే కమీషన్ల కోసం వినియోగించారన్న అనుమానాలున్నాయి. బర్డ్‌లో కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న దాదాపు 17మంది ఆర్థోపెడిక్ సర్జన్లను నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ చేశారని, దీనివెనుక పెద్దఎత్తున నగదు చేతులు మారినట్టు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లతో మాట్లాడుకుని అక్కడ రూ.ఐదారు లక్షలయ్యే ఆపరేషన్ తిరుపతిలో అదే వైద్యులతో రెండు,మూడు లక్షల రూపాయలతోనే చేసేస్తామని బర్డ్‌కు తీసుకొచ్చి శస్త్ర చికిత్సలను చేసి పంపినట్టు తెలుస్తోంది. ఆయా ఆస్పత్రి వైద్యులను ఇక్కడికి గెస్ట్ డాక్టర్లుగా పిలిపించుకుని వారితో ఉచితంగా సర్జరీలు చేయించి శ్రీవారి ప్రోటోకాల్ దర్శనం చేసి పంపేవారన్న ఆరోపణలున్నాయి.

ఏర్పేడు సీఐపై ఎస్పీ సీరియస్

● నెంబర్‌గేమ్ ఆటగాళ్లపై చర్యలు తీసుకోలేదంటూ ఆగ్రహం

ఏర్పేడు, ఆగస్టు 20 : ఏర్పేడు మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోకపోవడం పట్ల సీఐ శ్రీరామ శ్రీనివాసులుపై ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్ అయినట్లు సమాచారం. పాపానాయుడుపేటలో ఏటా ఆగస్టు మాసంలో నిర్వహించే ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి జనం హాజరవుతుంటారు.వీరిలో కొంతమంది డబ్బాలో చింతగింజలు పోసి ఆడే నెంబర్‌గేమ్ అనే ఆటను లక్షల రూపాయలు బెట్టింగ్ పెట్టి ఆడుతుంటారు.పోలీసులు నిఘా వుంచి చర్యలు తీసుకుంటుంటారు. ఈసారి పదిరోజులుగా జరుగుతున్న ధర్మరాజుల స్వామి ఉత్సవాల్లో కూడా నెంబర్‌గేమ్ నడుస్తోంది. ఈ ఆట ఆడేవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు వారం రోజుల క్రితమే సీఐ శ్రీరామ శ్రీనివాసులును ఆదేశించారు.అయితే నెంబర్‌గేమ్ నిర్వాహకులతో కుమ్మక్కైన సీఐ అలాంటిదేమీ జరగడం లేదని ఎస్పీ కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు.అయితే నెంబర్‌గేమ్ జోరుగా సాగుతోందన్న సమాచారంతో రేణిగుంట డీఎస్పీకి చర్యలు తీసుకోమని ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రత్యేక నిఘా వుంచి నెంబర్‌గేమ్ ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.13,850 స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ శ్రీరామ శ్రీనివాసులుపై ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం.స్టేషన్‌కు సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన వారితో కూడా సీఐ అగౌరవంగా మాట్లాడుతున్నాడన్న ఆరోపణలున్నాయి.ఈ నేపథ్యంలో సీఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని సమాచారం.

న్యాయంకోసం

● నిరసన శిబిరంలోనే జూడాల ఓపీ సేవలు
● స్విమ్స్, రుయాస్పత్రుల్లో కొనసాగిన నిరసనలు



రుయాస్పత్రిలో జూడాలకు మద్దతుగా నిలిచిన వైద్య, పారా మెడికల్ విద్యార్థులు



స్విమ్స్‌లోని శిబిరంలోనే ఓపీ సేవలు అందిస్తున్న జూడాలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 20: కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో మహిళా జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారంపై స్విమ్స్, రుయాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు (జూడాలు) వారం రోజులుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు మంగళవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా స్విమ్స్ వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలోనే రోగులకు ఓపీ సేవలు అందించారు. రోగులు సైతం జూడాలకు మద్దతుగా నిలిచి, శిబిరం వద్దే వైద్య సేవలు పొందారు. అనంతరం డాక్టర్లపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను రుయాస్పత్రిలో నాటక ప్రదర్శన ద్వారా తెలియజేశారు. ఓ వైద్యుడికి అన్యాయం జరిగితే దేశంలోని వైద్యులంతా ఐకమత్యంగా పోరాడాలని అప్పుడే డాక్టర్లకు రక్షణ ఉంటుందని వారు ఈ ప్రదర్శనతో పిలుపునిచ్చారు. జూడాలకు పారా మెడికల్ విద్యార్థులు, ఐద్వా, జనవిజ్ఞాన వేదిక నేతలు మద్దతు తెలిపారు.



న్యాయం కోరుతూ స్విమ్స్‌లో జూనియర్ డాక్టర్ల మానవహారం

హత్యాచారం అమానుషం : ఎమ్మెల్యే ఆరణి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి, సుగుణమ్మ, కిరణ్‌రాయల్

జూనియర్ డాక్టరుపై హత్యాచారం అమానుషమని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు మంగళవారం రాత్రి తిరుపతిలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ, జనసేన తిరుపతి ఇన్‌చార్జులు సుగుణమ్మ, కిరణ్‌రాయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటువంటి ఘటనకు పాల్పడిన నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి అండగా నిలవాలన్నారు. అనంతరం స్విమ్స్ సర్కిల్ నుంచి మహతి ఆడిటోరియం.. అక్కడినుంచి తిరిగి స్విమ్స్ సర్కిల్ వరకు జూడాలు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన నేతలతోపాటు స్థానికులు సైతం స్వచ్ఛందంగా పాల్గొని జూడాలకు మద్దతు తెలిపారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

● ఉక్కపోతతో అల్లాడిపోతున్న వృద్ధులు, పిల్లలు





ఎండలతో నిర్మానుష్యమైన రేణిగుంట పోలీసులైను వీధి - మధ్యాహ్నం పాఠశాలకు పిల్లలను గొడుగులతో తీసుకెళుతున్న తల్లి

రేణిగుంట,ఆగస్టు20:గడిచిన పదిరోజులుగా కాస్తున్న ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఆదివారం రేణిగుంటలో 38డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, సోమవారం 36డిగ్రీలు, మంగళవారం 29డిగ్రీలు నమోదైంది. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండడంతోఉక్కపోతతో వృద్ధులు,పిల్లలు అల్లాడిపోతున్నారు.ఇంటి నుంచిబయటకు రావాలంటే భయపడిపోతున్నారు. మధ్యాహ్నం 12గంటలకల్లా ప్రధానవీధులు ఖాళీగాదర్శనమిస్తున్నాయి. మరోపక్క అత్యవసర పనులమీద బయటకు వచ్చే ప్రజలు ఎండలకు తట్టుకోలేక కూల్‌డ్రింక్ షాపులకు పరుగులు తీస్తున్నారు.

పట్టపగలు నిమిషాల్లో దోచేశాడు!



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

తిరుచానూరు, ఆగస్టు 20: తిరుచానూరులో మంగళవారం ఉదయం 15 నిమిషాల వ్యవధిలో ఓ ఇంట్లో చొరబడ్డ బీరువాలో ఉన్న నగ, నట్ర ఎత్తుకెళ్లాడు.పోలీసుల కథనం మేరకు ... తిరుచానూరులోని కొత్త వీధిలో భారతి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. పక్కనే టైలరింగ్‌షాప్ నడుపుతోంది. ఉదయం 10.30గంటల సమయంలో ఓ వ్యక్తి దర్జాగా మిద్దెపైకి వెళ్లి భారతి ఇల్లు గడియ తొలగించి బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లాడు. కొంత సేపు తరువాత మిద్దె పైకి వెళ్లిన భారతి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడివుండడం గమనించింది.చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, క్లూస్‌టీం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి నిందితుడి వేలిముద్రలను సేకరించారు. సమీపంలోని ఓ పాఠశాలలో ఉన్న వీడియో ఫుటేజీని పరిశీలించగా ఓ వ్యక్తి దర్జాగా మిద్దెపైకి వెళ్లి దొంగతనం చేసిన దృశ్యాలు లభ్యమైనట్లు తెలిసింది. భారతి ఇంట్లో సుమారు 12 సవర్ల బంగారు నగలు చోరీ జరిగినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఫ్రైడేని డ్రైడేగా పాటిద్దాం

కలెక్టర్ పిలుపు

తిరుపతి(విద్య), ఆగస్టు 20: ఫ్రైడేని డ్రైడేగా పాటిద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ దోమల దినం సందర్భంగా కలెక్టరేట్‌లో దీనికి సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. దోమల వల్ల చికున్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, పరిసరాల పరిశుభ్రతతో నివారించవచ్చని చెప్పారు. ఇళ్లలో ఫ్రిడ్జ్, కూలర్లతోపాటు పాత టైర్లు తదితరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు ఎక్కువగా కురిసే సమయం కావడంవల్ల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వసతి గృహాలను, బాలల సంరక్షణ కేంద్రాలను, గురుకుల పాఠశాలలు, విద్యాసంస్థలను అధికారులు తనిఖీ చేసి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి, వైద్యాధికారులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నెల్లూరు (విద్య) : విధుల్లో అలసత్వంతోపాటు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ డీఈవో రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లు ఆర్‌పీ ప్రసన్నలక్ష్మి, ఎల్ శ్రీనివాసరావు విధుల్లో అలసత్వం వహించడమేకాక బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై నెల్లూరు డిప్యూటీఈవో విచారించి, నివేదిక అందచేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ టీచర్లను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ ఉపాధ్యాయులపై కొన్ని రోజుల క్రితం విద్యార్థులే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన విషయం గమనార్హం.

బుదూరు భూ వివాదంపై గ్రామసభ


ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న తహసీల్దారు, సిబ్బంది

దొరవారిసత్రం, ఆగస్టు 20 : బుదూరులో భూ సమస్యలపై మంగళవారం తహసీల్దార్ శైలకుమారి ప్రత్యేకంగా గ్రామసభ నిర్వహించారు. తమ పొలాలను ఓ రియల్టర్ అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, న్యాయం చేయాలని 30 మంది రైతులు ఇటీవల తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. దీంతో తహసీల్దార్ శైలకుమారి గ్రామ సభ నిర్వహించారు. సభలో రైతుల నుంచి వివరాలు సేకరించారు. రైతులను మోసం చేసి అక్రమంగా రియల్టర్ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ప్రాథమిక విచారణలో తేలినట్లు తహసీల్దార్ తెలిపారు. రైతులకు తెలియకుండానే సుమారు నాలుగెకరాల వరకు అక్రమ రిజిస్ట్రేషన్ జరిగినట్లు సమాచారం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతు వారీగా క్షుణ్ణంగా విచారించాక చర్యలు ఉంటాయని తహసీల్దార్ స్పష్టం చేశారు. గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, వీఆర్‌వో మురళి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మావిళ్లపాడు మోడల్ స్కూల్ పరిశీలన

దొరవారిసత్రం, ఆగస్టు 20: మండలంలోని మావిళ్లపాడు మోడల్ స్కూల్‌ను స్థానిక తహసీల్దార్ శైలకుమారి మంగళవారం పరిశీలించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టాక పాఠశాలల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలో తాగునీరు, ఆహారం పరిశీలించారు. ప్రిన్సిపల్ సుమలత నుంచి వివరాలు సేకరించారు. తరగతి గదులను చేశారు.

ఇటుకబట్టీ యజమానిపై చర్యలకు డిమాండ్


బాధిత గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ముకుంద

పెళ్లకూరు, ఆగస్టు 20 : కానూరు రాజుపాలెం గిరిజనులపై ఇటుకబట్టీ యజమాని చేసిన దౌర్జన్యాన్ని ఖండిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముకుంద కోరారు. మంగళవారం ఆయన బాధిత గిరిజనులతో కలసి తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుకబట్టీ యజమాని దౌర్జన్యాన్ని ఖండించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. అభంశుభం తెలియని గిరిజనులపై దౌర్జన్యకాండ జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటుకబట్టీ యజమానిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

రేషన్ సరుకులపై ఫిర్యాదులందితే డీలర్లపై చర్యలు

డక్కిలి, ఆగస్టు 20 : ప్రతి కార్డుదారుడుకీ సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో డీలర్లతో సమావేశమయ్యారు. లబ్ధిదారులు సరుకులు అందలేదని ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకొంటామన్నారు. డీలర్ల లైసెన్సు కాలపరిమితిని రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఎండీ ఆపరేటర్లు లేని ప్రాంతాల్లో ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు. దేవునివెల్లంపల్లి గిరిజన కాలనీ, పాతనాలపాడుల్లో వీర్వోల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తామన్నారు. ఏడు రేషన్ షాపుల్లో కార్డుల మ్యాపింగ్‌లలోగందరగోళం నెలకొందని డీలర్లు చెప్పారు. సివిల్‌సప్లయ్ డీటీ సంధ్య ఉన్నారు.

పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు



గూడూరు, ఆగస్టు 20: కొండాగుంటలో మంగళవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గాలికుంట వ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం గాలికుంటువ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని టీకాల ద్వారా శాశ్వతంగా నివారించవచ్చునన్నారు. డాక్టర్ సుదర్శన్, శ్రీనివాసులురెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

23న టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక

గూడూరు అర్బన్, ఆగస్టు 20: స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 23న ఉమ్మడి నెల్లూరు జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపికలను నిర్వహించనున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్యామసుందర్‌రావు, కార్యదర్శి రమ్య మంగళవారం ఈమేరకు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు 2010 ఏప్రిల్ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని సూచించారు.

నేడు పోలేరమ్మ హుండీ నగదు లెక్కింపు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 : పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద పోలేరమ్మ హుండీని బుధవారం లెక్కిస్తున్నట్లు దేవదాయశాఖ ఈవో శాశ్యాంక్ తెలిపారు. హుండీ లెక్కింపు అనంతరం అమ్మవారి చీరలకు వేలంపాట వేస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు.

బంగారు నగలు,నగదు చోరీ

తడ, ఆగస్టు 20 : తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. స్థానిక బీసీ కాలనీలో లోక్కు చెంచురత్నం రోజూ రాత్రి ఇంటికి తాళంవేసి మిద్దెపైననిద్రపోతుంటారు. సోమవారం రాత్రి నిద్రపోయి తెల్లవారుజామున కిందకు వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతోపాటు బీరువా తెరిచి ఉండటం గుర్తించాడు. బీరువాలో 9.5 సవర్ల బంగారు నగలు, రూ. 65 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినటు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని సైకిలిస్టు దుర్మరణం


మృతుడు చంద్రయ్య

తడ, ఆగస్టు 20 : లారీ ఢీ కొని సైకిలిస్టు మృతి చెందాడు. స్థానిక బోడి లింగాలపాడు కు చెందిన ఉద్దండి చంద్రయ్య (54) స్థానికంగా ఉన్న పరిశ్రమలో పని చేస్తున్నాడు. రోజూ సైకిల్‌పై పరిశ్రమకు వెళ్లి వస్తుంటాడు. సోమవారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బోడిలింగాలపాడు మలుపు సమీపంలో నెల్లూరు వైపు వెళ్తున్న ఐసర్ లారీ ఢీ కొట్టింది. చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని వెంటనే చెన్నై ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులాల్లో అధికారుల పరిశీలన


సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

కోట, ఆగస్టు 20 : స్థానిక యానాదుల బాలికల గురుకులం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులాలతోపాటు బాలికల ఉన్నత పాఠశాలల పరిసరాల పరిశుభ్రతపై అధికారుల బృందం ఫోకస్ పెట్టింది. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో భవానీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్, ఎఈ హేమంత్‌కుమార్‌లతో కూడిన బృందం ఆయా గురుకుల పాఠశాలల్లో పారిశుధ్యం, తాగునీరు సరఫరా, వసతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు వండిపెడుతున్న భోజనాలను నిశితంగా గమనించారు. మురుగుకాలువల్లో శానిటేషన్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. తాగునీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేయాలన్నారు. పలు అంశాలపై ఆయా ప్రిన్సిపాళ్లకు అధికారుల బృందం పలు సూచనలు, సలహాలు ఇచ్చింది.

ఇలా ఉంటే ఆలనా 'పాలనా' ఎలా..



ఓజిలిలో పెచ్చులూడుతున్న డిప్యూటీ తహసీల్దారు గది గోడలు - అధ్వానస్థితికి అద్దం పడుతున్న భవనం వెనుకభాగం

● శిథిలావస్థలో ఓజిలి,పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయాలు- ● బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ

పెళ్లకూరు, ఆగస్టు 20: స్థానిక తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియనట్లుంది. ఈ కార్యాలయాన్ని నిర్మించి 30 ఏళ్లకు పైనే అవుతోంది. ప్రస్తుతం గోడలు బీటలు వారుతున్నాయి. శ్లాబు పెచ్చులూడుతోంది. ఫ్లోరింగ్ దెబ్బతింది. దీంతో ఇక్కడ విధులు నిర్వహించడానికి ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. తేలికపాటి వర్షానికి కార్యాలయం మొత్తం ఉరుస్తుండడంతో రికార్డులు తడుస్తున్నాయి. తహసీల్దార్ గది ప్రమాదకరంగా మారడంతో పక్కనే ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయంలోకి మార్చి కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాల్సి ఉంది. ఇటీవల ఓజిలిమండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గదిలో శ్లాబు పెచ్చులూడాయి. అలాంటి సంఘటన పెళ్లకూరులో జరగక ముందే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


పెళ్లకూరు తహసీల్దార్ ఆఫీస్‌లో దెబ్బతిన్న ఫ్లోరింగ్

ముప్పై ఏళ్లలో మూడు పర్యాయాలు మరమ్మతులు

ఓజిలి: తహసీల్దారు భవనం 30 ఏళ్లకే కాలం తీరింది. 1994లో అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన రెడ్డి చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించారు. గత 10 ఏళ్ల నుంచి మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. ఈ 30 ఏళ్లలో ఈ భవనానికి మూడు పర్యాయాలు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ శ్లాబు పెచ్చులూడి పడుతూనే ఉంది. గోడల నెర్రెలకు ప్యాకింగ్ చేసి పెయింటింగ్ పనులు చేసినా పెద్దగా ప్రయోజనం కనబడలేదు. ఈక్రమంలో ఈనెల 2న తహసీల్దార్ గదిలో శ్లాబు ఊడిపడిన విషయం విదితమే. దీంతో ఆ గదిని పూర్తిగా మూసివేసినట్టు డిప్యూటీ తహసీల్దారు మధుసూధనరాజు తెలిపారు.

విగ్రహ ధ్వంసం బాధ్యులను తక్షణమే అరెస్ట్ చేయాలి

● దళిత బహుజన ఐక్యవేదిక నాయకుల డిమాండ్


అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో దళిత నేతలు

వెంకటగిరి, ఆగస్టు 20 : వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహం తల భాగం నరికితే వంద రోజుల్లో తిరిగి నిర్మించామని, ధ్వంసం చేసిన నిందితులను పోలీసులు ఇప్పటికీ గుర్తించ లేకపోయారని దళిత బహుజన ఐక్య వేదిక కన్వీనర్ సహదేవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహన్ని ఐక్యవేదిక నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా అవిగ్రహం తల నరికిన దోషులను పట్టుకుని శిక్షించాలని కోరారు. 13 దళిత సంఘాలు దళిత బహుజన ఐక్యవేదిక పేరిట ఏకమై వంద రోజుల్లో విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. నిందితులను పట్టుకోకపోతే తాము మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు ఏడీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంగిలాల రామచంద్రయ్య, ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మయ్య, దళిత సంఘాల నాయకులు రామకృష్ణ, గోపాల్, మంగళపురి సురేష్, దాసరి వంశి, దసుం జయ,ఏలూరు రాజేంద్ర మాదిగ, మాల్లారం బాబు, చాతరాసి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గూడూరు, ఆగస్టు 20: కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్యకళాశాలలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని మహిళా చట్టాలు అమలులోకి వచ్చినా ఏదో ఒక చోట మహిళలపై హత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. కోల్‌కతా ఘటన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎడీఎస్‌యూ నాయకులు చరణ్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, హరిప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్ : డ్వామా పీడీ


రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

గూడూరు అర్బన్, ఆగస్టు 20: అవినీతికి తావులేకుండా ఉపాధి పనులు చేపట్టాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.7కోట్ల వరకు పనులు జరిగాయన్నారు. సామాజిక తనిఖీల్లో రూ. 6.75లక్షల పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించి రికవరీ చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించామన్నారు. బాధ్యులుగా శివ, యోగేష్ అనే టెక్నికల్ అసిస్టెంట్లను, ఫీల్డ్ అసిస్టెంట్లు విజయలక్ష్మీ, సురేష్, మస్తాన్‌బాబు, శోభన్, మురళిలను సస్పెండ్ చేశామన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో వెంకటరమణ, ఏపీవో పెంచలయ్య పాల్గొన్నారు.

చెత్తకుప్పలో తపాలా కవర్లు



తడ, ఆగస్టు 20 : ఉత్తరాలు చెత్తకుప్పలో కనిపించడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు. అందులో ఏటీఎం కార్డులు, బ్యాంకుల్లో కుదపెట్టిన బంగారం నోటీసులు వంటి విలువైనవి ఉత్తరాలు ఉన్నాయి. కొత్తకుప్పం తపాలా కార్యాలయానికి వచ్చిన ఉత్తరాలు బట్వాడా చేయకుండా పోస్టల్ ఉద్యోగులు రోజుల తరబడి తమవద్దే ఉంచుకున్నట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. తడ కొత్తకుప్పం సమీపాన గ్రామదేవత ఆలయం పక్కన గ్రామానికి చెందిన కవర్లు డెలివరీ చేయకుండా ఉంచుతున్నారు. గ్రామస్థులనే వచ్చి తీసుకోమంటున్నారు. దీంతో వాటికి భద్రత ఉండటంలేదని సర్పంచ్ చెబుతున్నారు. అయితే. మంగళవారం ఉదయం ఆలయ సమీపాన చెత్తలో ఈ ఉత్తరాలను గమనించిన గ్రామస్థులు విస్తుపోయారు. ఎవరో ఆకతాయిలు ఆ ఉత్తరాలను ఇలా పడేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇంటింటికీ డెలివరీ చేయాలని చెబుతున్నా సిబ్బంది స్పందించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పందుల స్వైర విహారం


టీటీడీ కల్యాణ మండపం వీధిలో పందులు

వెంకటగిరిటౌన్, ఆగస్టు 20: మున్సిపాలిటీలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. టీటీడీ కల్యాణ మండపం, కాశీపేట, బంగారుపేట, ఎన్టీఆర్ కాలనీ, ఎపీటీఎఫ్ కాలనీ, తోలిమిట్ట, బొగ్గులమిట్ట, మాసాపేట తదితర ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటి ప్రభావంతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయోమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పందులు,కోతులు, కుక్కలను అరికట్టాలని పలుమార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. తమకు మరిన్ని ఇబ్బందులు ఎదురుకాకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ ఆఫీసుకు ముఖం చాటేస్తున్న అధికారులు



కోట, ఆగస్టు 20 : ఇక్కడి రోడ్ల, భవనాల (ఆర్‌అండ్‌బి) సబ్ డివిజన్ కార్యాలయం నామమాత్రంగా మిగులుతోంది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు కోటలో చాలా కాలంగా ఈ కార్యాలయం ఉంది. మండలానికి ఒకరు చొప్పున అసిస్టెంట్ ఇంజనీర్ ఈ ఆఫీస్‌లో ఉండాలి. నాలుగేళ్లుగా ఇన్‌చార్జి ఏఈలే దిక్కయ్యారు. ఓజిలి, గూడూరులకు సంబంధించి ఆ ఇంజనీర్లు కూడా చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి సబ్ డివిజన్ కార్యాలయానికి బాధ్యులు రాకపోవడంతో ప్రజలు, కాంట్రాక్టర్లు విసిగిపోతున్నారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండరు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. గతంలో డీఈ స్థాయి అధికారి కూడా ఇక్కడ పనిచేయకుండా డివిజనల్ కార్యాలయానికే పరిమితమయ్యారు. ఆర్‌అండ్‌బి శాఖలోని ఏఈలు కూడా సముద్రతీర ప్రాంత మండలాలకు రావాలంటే విముఖత చూపుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి సబ్ డివిజన్ కార్యాలయంలో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి

తడ, ఆగస్టు 20 : మండలంలో ఈనెల 23న జరిగే గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో విజయకుమార్ కోరారు. 18 పంచాయతీల్లో ఈ గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల గుర్తింపు, తీర్మానాలను సభ దృష్టికి తీసుకువస్తామన్నారు.

బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీల గురించి వివరిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 : బాషా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయని బాషా ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ బాషా తెలిపారు. పోటీలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరగాలని,ఉన్నతస్థాయికి ఎంపికయ్యేలా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్, అసరత్, ప్రసాద్, అబుబకర్, షాహీద్, వెంకటేష్ సులేమాన్, సంజాయ్, రామమూర్తి, నారాయణ పాల్గొన్నారు.

ఇంటింటా బీఎల్‌ఓల సర్వే విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, ఆగస్టు 20 : బీఎల్‌వోలు ఇంటింటా సర్వేను వేగవంతం చేసి లక్ష్యాలను అధిగమించాలని తహసీల్దారు కటారి జయజయరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బూత్‌లెవల్ అధికారులకు ఓటరు నమోదు ప్రక్రియపై శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో భవానీలు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి అక్టోబరు 18 వరకు ప్రతి గ్రామంలోనూ ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఫోటోలు సక్రమంగా రాకపోవడం, తప్పులు తడకలు ఉన్నట్లయితే గుర్తించి అక్కడిక్కడే పరిష్కారం చూపాలన్నారు. 1-1-2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా కొత్త ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటా తిరిగి ఓటు నమోదుపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు అల్లం మల్లికార్జున్‌రావు తదితరులు ఉన్నారు.

వెంకటగిరిటౌన్: ఓటు హక్కుపై బీఎల్‌వోలు ప్రతి ఇంటినీ సర్వే చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దార్ మునిలక్ష్మీ అన్నారు. మంగళవారం స్థానిక బీఎల్‌వోలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1.1.2005 నిండిని ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు, తప్పులు సరిదిద్దుకునే అవకాశం కల్పించారన్నారు. డీటీ యువరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి టీడీడీ సహకారం


ఈవో కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, ఆగస్టు 20: తమ నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి సహకారం అందించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. మంగళవారం తిరుపతిలో టీటీడీ ఈవో శ్యామలరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో విశిష్టత కలిగిన పురాతన ఆలయాలు ఉన్నాయన్నారు. టీటీడీ ద్వారా వీటిని అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలని కోరామన్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును కూడా కలిశామన్నారు. ఆయన వెంట శ్రీపతి బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో వినూత్న స్కోర్ పోర్టల్ ప్రారంభం


సమావేశమైన శ్రీసిటీ అధికారులు

వరదయ్యపాళెం, ఆగస్టు 20: సుస్థిర అభివృద్ధి చర్యల్లో భాగంగా శ్రీసిటీ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ స్కోర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలో పరస్పర సహకార ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. మంగళవారం నిర్వహించిన వర్చువల్ లాంచ్ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల పర్యావరణ నిర్వాహకులు, సీనియర్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్‌లు హాజరయ్యారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్శిటీకి చెందిన సస్టైనబిలిటీ నిపుణులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కాగా శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్‌కామర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజరు డాక్టర్ పి.వెంకటేశ్వరన్ మాట్లాడుతూ స్కోర్ అనేది వనరుల భాగస్వామ్యం కోసం ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుందని, సమాచార మార్పిడి, పర్యావరణం, ఆర్థిక ప్రభావితమైన విషయ విశ్లేషణకు సహకారం అందిస్తుందన్నారు. మిచిగాన్ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ వ్యర్థాలను తగ్గించడం, ఇతర అక్కడ అమలు చేస్తున్న సుస్థిర కార్యక్రమాలు, కార్యాచరణ పథకాలపై డాక్టర్ సుధాకర్‌రెడ్డి వివరించారు. పోర్టల్‌ను ప్రారంభించడంలో శ్రీసిటీ చొరవను ఆయన అభినందించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పోర్టల్ ప్రాముఖ్యతను ప్రస్తావించారు. స్కోర్ పోర్టల్ ద్వారా ఉదహరించబడిన శ్రీసిటీ జీరో-వేస్ట్ కార్యక్రమాలు, సుస్థిర చర్యల పట్ల తమ నిబద్ధతను తెలియజేయడంతోపాటు ఇతర పారిశ్రామికవాడలకు ఒక మోడల్ నిలుస్తాయన్నారు.

బాలాయపల్లిలో వ్యాధులపై అవగాహన ర్యాలీ



వెంకటగిరిటౌన్, ఆగస్టు 20: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బాలాయపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లియో మాట్లాడుతూ మురికి గుంటలు, టబర్లు, కొబ్బరి చిప్పలు, పాత కుండీలు, కుండలు వంటి వస్తువుల వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం బాలాయపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది మునిరాజా, రాజేశ్వరి పాల్గొన్నారు.